ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 2 ఆగస్టు 2024 | 5





కొవ్వూరులో ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు

## పార్టీలకతీతంగా పనిచేస్తా.. స్పీకర్ పదవికి వన్నె తెస్తా

**స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

గోకవరం, ఆగస్టు 1 : రాజ్యాంగాన్ని గౌరవిస్తూ అసెంబ్లీలో పార్టీలకతీతంగా పనిచేసి స్పీకర్ పదవికి వన్నె తెస్తానని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. సుమారు రూ.3.75 కోట్ల వ్యయంతో నిర్మించ నున్న గోకవరం-తంటికొండ ప్రధాన రహదారి నిర్మాణ పనులకు గురువారం ఆయన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి శంకు స్థాపన చేసి మాట్లాడారు. శాసనసభలో ప్రజా సమస్యలను ప్రస్తావించే ఎమ్మెల్యేలకు పార్టీల కతీతంగా ఎక్కువ సమయం కేటాయిస్తానన్నారు.స్పీకర్ పదవి చేపట్టాక మొట్టమొదటిగా తంటికొండ వెం కటేశ్వరస్వామివారిని దర్శించుకోవడం తాను అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల తీరుపై శాసనసభ నిబంధనలు ప్రకారం నడుచు కోవడం జరుగుతుం దన్నారు. గతంలో తాను ఏడు పర్యాయాలు మంత్రిగా పని చేయడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు హయాంలో రాష్ట్రం తిరిగి అన్ని విధాలా అభివృద్ధిలో పయనిస్తుందన్నారు.


తంటికొండలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

## ఫలించిన వర్గీకరణం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 1 : ఎస్సీ వర్గీకరణ సమంజసమేనంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల మాదిగలు సంబరాలు చేసుకున్నారు.. దీనిలో భాగంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్,మాజీ ఉపప్రధాని బాబూజగజ్జీవన్ రామ్, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కొవ్వూరులో ఎన్‌టీఆర్ పూలమాలవేసి కూటమి విజయమంటూ నినాదాలు చేశారు. రాజమహేంద్రవరంలో టీడీపీ మాజీ డిప్యూటి ఫ్లోర్ లీడర్ కోరుమిల్లి విజయశేఖర్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ ఉద్యమం 30 ఏళ్ళ పాటు సాగిందన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పురావడం ఆనందంగా ఉందన్నారు. ఇది మా భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు



రాజమహేంద్రవరంలో ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

## ప్రజా సమస్యలపై పోరాటం

### సీపీఐ జిల్లా సమావేశంలో కార్యవర్గ సభ్యురాలు వనజ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 1 : ప్రజా సమస్యలపై గ్రామస్థాయి నుంచి పోరాటం చేయాల్సి ఉందని, పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. రాజమహేంద్రవరంలో గురువారం జరిగిన సీపీఐ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో అనేక ప్రజా సమస్యలు రాజ్యమేలుతున్నాయని, వాటి పరిష్కారానికి పార్టీ కేడర్ కృషి చేయాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సీపీఐ దశలవారీ పోరాటం చేస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేశు అన్నారు. జగన్మోహనరెడ్డి నిరంకుశ విధానాల కారణంగానే వైసీపీ అడ్రస్ లేకుండా పోయిందన్నారు. పోలవరం ప్రాజెక్టు వేగవంతం, రాజధాని అమరావతి నిర్మాణం, విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణ తదితర సమస్యలపై ఇటీవల సీపీఐ బృందం సీఎం చంద్రబాబును కలిసినట్టు చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే 90 శాతం నిధులను కేంద్రమే ఇస్తుందని తద్వారా రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. రాజధాని అమరావతికి కేంద్రం ఇస్తానన్న రూ.15 వేల కోట్ల నిధులను గ్రాంటుగా ఇవ్వాలని లేదా బడ్జెట్‌లో సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ శత దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది డిసెంబరు 26 నుంచి వచ్చే ఏడాది డిసెంబరు 26వ తేదీ వరకూ ఏడాదిపాటు శత దినోత్సవం ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని పార్టీ జాతీయ సమితి పిలుపునిచ్చిందని వెల్లడించారు. ప్రజానాట్య మండలి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మహంతి లక్ష్మణరావు నాయకత్వంలో విప్లవ గీతాలు ఆలపించారు.కేరళలోని వయనాడ్ వరద బాధితులు, మృతులకు సీపీఐ తూర్పుగోదావరి జిల్లా తరపున రూ.10,120లు ఆర్థిక సహాయం అందించేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సహాయ కార్యదర్శి కూండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, జిల్లా కార్యవర్గసభ్యులు కె.జ్యోతిరాజు, చింతలపూడి సునీల్, కె.శ్రీనివాస్, పి.నాగేశ్వరరావు, టి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

### ఆర్‌అండ్‌బీ రోడ్లపై విగ్రహాలు ఏర్పాటు చేయవద్దు
### సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాల్సిందే : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : ఆర్‌అండ్‌బీ రోడ్ల మీద ఎటువంటి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వకూడదని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 2023 ఫిబ్రవరి 18న ఇచ్చిన జీవో నెంబర్ 18, ఆర్‌అండ్‌బీ శాఖ అదే ఏడాది ఏప్రిల్ 8న జీఎంఎస్‌ఎస్ నెంబర్ 55 ప్రకారం ఉత్తర్వుల విడుదల చేశాయన్నారు. గ్రామ, మండల స్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా విగ్రహాలు పెట్టనీయకూడదన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే సత్వర చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

### డిగ్రీ ప్రవేశాల్లో ఆప్షన్లకు 5 వరకూ గడువు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 1 : డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల వెబ్ ఆప్షన్ల నమోదుకు ప్రభుత్వం గురువారం నుంచి నుంచి 5వ తేదీ వరకూ అవకాశం కల్పించిందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఏ కళాశాలలో ఏ విభాగంలో సీటు కేటాయించబడిందో విద్యార్థులకు ఈనెల 10వ తేదీన తెలుపబడుతుందన్నారు. 12వ తేదీ నుంచి 16వ తేదీలోగా విద్యార్థులు తమకు కేటాయించిన కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు వెబ్ ఆప్షన్లను ఎంచుకోవడంలో ఎటువంటి సందేహాలున్నా ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాలులో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రంలో సంప్రదించవచ్చన్నారు.

## నిను మరువం మూలారెడ్డి




నల్లమిల్లి మూలారెడ్డిని మరువలేం.. ఆయనతో మాకు ఉన్న సాన్నిహిత్యం అటువంటిదని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మూలారెడ్డి ద్వితీయ వర్ధంతిని అనపర్తిలో గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పందలపాకలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాలలు వేసి ఆవిష్కరించారు. జోహార్ మూలారెడ్డి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. - **వివరాలు 7,8 పేజీల్లో**

## పింఛన్ల పంపిణీ సాగిందిలా..

| పింఛన్లు : 2,40,595 | పంపిణీ : 2,36,607 | సొమ్ము : 100,43,40,500 | శాతం : 97.90 | స్థానం : 5 |
|---|---|---|---|---|

# తొలిరోజే.. 97.9%


తాడిపర్రులో పింఛన్ అందిస్తున్న మంత్రి దుర్గేష్

- ఆనందించిన పింఛనుదారులు
- తెల్లవారుతుండగానే ఆరంభం
- రాత్రి 8 గంటల వరకూ పంపిణీ
- 4,200 మంది ఉద్యోగులు
- ఇంటింటికీ వెళ్లి అందజేత
- నేడు మిగిలిన వారికి పంపిణీ

## రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచిన తూర్పు

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

పింఛన్..కూటమి ప్రభుత్వంలో నో టెన్షన్.. ఒకటో తేదీ తెలవారుతుండగానే ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. గురువారం తెలవారుతుండగా ఉదయం 5 గంటలకే తలుపుతట్టి మరీ పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. జిల్లాలో సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు 4200 మంది పింఛన్ల పంపిణీలో భాగస్వాములయ్యారు. ఉద యం నాలుగన్నర గంటలకు తమకు అప్పగించిన ప్రాంతాలకు చేరుకుని పింఛన్లు ఆరంభించారు. తొలిరోజే ఏకంగా 97.90 శాతం పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం పింఛనుదారులు 2,40,595 మంది ఉండగా రూ.102 కోట్ల 54 లక్షల 77 వేల 500 సొమ్ము సమకూర్చారు. 3900 మంది సచివాలయ ఉద్యోగులు, 300 మంది ఇతర ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారు. గురువారం ఒక్కరోజే 2,36,607 మందికి 100 కోట్ల 43 లక్షల 40 వేల 500 సొమ్ము పింఛనుదారులకు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీలో ఐదో స్థానంలో నిలిచారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి 99 శాతం లక్ష్యంగా పెట్టగా దీని సాధన కోసం డీఆర్‌డీఏ పీడీ మూర్తి శ్రమించారు. అనేక చోట్ల లబ్ధిదా రులు నిద్రలేవకపోయినా సచివాలయ ఉద్యోగులు, కూట మి నాయకులు వాళ్ల తలుపు తట్టి పింఛన్లు ఇచ్చారు.ఈ నేపథ్యంలో లబ్ధిదారుల కళ్లలో ఆనందం కనిపించింది. పింఛను ఎవరు ఇస్తున్నారంటే వృద్ధులు చంద్రబాబు అని ఆనందంతో చెబుతుండడం గమనార్హం. మానసిక విక లాంగులదీ ఇదే పరిస్థితి.ఇదిలా ఉండగా జిల్లాలో కొంత మంది సచివాలయ ఉద్యోగులు నూరుశాతం పంపిణీ చేశారు. చాలా మంది ఊళ్లో లేకపోవడం, కొందరు చని పోవడం వంటి కారణాల వల్లే 2.10 శాతం పెండింగ్ పడింది. శుక్రవారం సాయంత్రానికి నూరుశాతం పూర్తి చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఊరికి వెళ్లిన వారికి ఫోన్లు చేసి మరీ రప్పిస్తున్నారు.జిల్లాలో గురువారం జరిగిన పింఛన్ల పంపిణీలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు కందుల దుర్గేష్, ఆనం వెంకటరామనారాయణ రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడంతో పాటు వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకోవడం గమనార్హం.కొంత మంది ఉద్యోగులు లక్ష్య సాధనకు రాత్రి 8గంటల వరకూ పింఛన్ల పంపిణీ చేయడం గమనార్హం.

## పింఛనుదారులతో సెల్ఫీ


రాజమహేంద్రవరంలో వృద్ధురాలికి కలెక్టర్ ప్రశాంతి పింఛను అందజేస్తుండగా సెల్ఫీ తీస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చిత్రంలో అనుశ్రీ సత్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 1 : పింఛన్ల పంపిణీ నూరుశాతం పూర్తి చేయాలని కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని 3,4 డివిజన్లకు సంబంధించి రాజేంద్రనగర్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 2,40,595 మందికి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు రూ.102 కోట్ల 55 లక్షలు అందజేస్తున్నా మన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో 30 వేల మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కమిషనర్ కేతన్ గర్గ్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ మేరకు పింఛనుదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తన సెల్‌లో కలెక్టర్ పంపిణీ చేస్తుండగా సెల్ఫీ తీసుకున్నారు.నగరంలో 6,21,24, 25,29,31,38,39 డివిజన్లలో కూటమి నాయకులు జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ నగర అధ్యక్షుడు యెనుముల రంగబాబు, టీఎన్‌టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నక్కా చిట్టిబాబు, శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు పంపిణీ చేశారు.

## నాడు వైసీపీ తొలగిస్తే నేడు ఇప్పించారు..



అనపర్తి, ఆగస్టు 1 : ప్రతిపక్ష పార్టీకి మద్దతుగా మాట్లాడిన నేరానికి గత ప్రభుత్వ హయాంలో అధి కారం ఉంది కదా అని పింఛన్ నిలుపుదల చేయించారు.సుమారు 8 నెలలుగా ఎన్ని ఆఫీసుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఆ వృద్ధుడికి పింఛన్ పునరుద్ధరించారు. అంతే కాకుండా నిలుపుదల చేయించిన వైసీపీ నాయ కుడితోనే ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో బాధితుడికి పంపిణీ చేయించడం ఆసక్తిగా మారింది. అనపర్తి శివారు కొత్తూరుకు చెందిన గొలుగూరి సుబ్బా రెడ్డి ప్రతి నెల పింఛను పొందుతున్నాడు.8 నెలల కిందట గ్రామంలో పర్యటించిన అప్పటి ప్రతిపక్ష నాయకుడు నల్లమిల్లితో పెంచిన ధరలు,విద్యుత్ చార్జీలపై మొరపె ట్టుకున్నాడు. దీంతో గ్రామ వైసీపీ నాయకుడు సత్తి గం గిరెడ్డి అధికారులతో మాట్లాడి పింఛన్ నిలుపుదల చేయించాడు.బాధితుడు నల్లమిల్లిని ఆశ్రయించడంతో పింఛన్ కోసం పోరాటం చేశారు. వృద్ధుడిని మరింత బాధిస్తూ పింఛన్‌ను గండేపల్లి మండలానికి బదిలీ చేయించారు. దీంతో వృద్ధుడు 8 నెలలుగా పింఛన్ కోల్పోయాడు. ఎమ్మెల్యేగా గెలుపొందిన నల్లమిల్లి వెంటనే అధికారులతో మాట్లాడి సుబ్బారెడ్డి పెన్షన్ పునరుద్ధరిం చారు. గురువారం తెల్లవారుజామున కొత్తూరు చేరుకున్న ఎమ్మెల్యే గ్రామస్థుల సమక్షంలో పింఛన్ తొలగించిన వైసీపీ నాయకుడు గంగిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

## గోపాలపురంలో అత్యధికం

జిల్లావ్యాప్తంగా 19 మండలాల్లో పింఛన్ల పంపిణీకి పోటీపడ్డారు.గోపాలపురంలో అత్యధికంగా 98.66 శాతం పంపిణీ చేశారు.ఇక్కడ 9197 మంది లబ్ధిదారులు ఉండగా 9074 మందికి అందజేశారు. చాగల్లులో 98.49 శాతం, కోరుకొండలో 98.48 శాతం, రాజమహేంద్రవరం అర్బన్ 98.42 శాతం, కొవ్వూరు 98.3 శాతం, నిడదవోలు అర్బన్ 98.26 శాతం, నల్లజర్లలో 98.13 శాతం, రాజానగరం 98.06 శాతం, తాళ్లపూడిలో 98 శాతం, రాజమహేంద్రవరం రూరల్‌లో 97.91 శాతం పంపిణీ జరిగింది. ఉండ్రాజవరంలో 97.77 శాతం, పెరవలి 97.72 శాతం, అనపర్తిలో 97.69 శాతం, నిడదవోలులో 97.67 శాతం కడియంలో 97.62 శాతం,కొవ్వూరు అర్బన్‌లో 97.62 శాతం పంపిణీ చేశారు. దేవరపల్లిలో 97.58 శాతం, సీతానగరంలో 97.44 శాతం,గోకవరంలో 97.44 శాతం, బిక్కవోలులో 96.83 శాతం, రంగంపేటలో 96.81 శాతం పంపిణీ జరిగింది. సర్వర్ డౌన్, డివైజర్లు పనిచేయక పోవడం, సెల్‌లో సిగ్నల్ లాగకపోవడం వంటి సమస్యలు ఎదురైనా ఎక్కడా వెనుకంజ వేయలేదు. నూరుశాతం పంపిణీకి ఉద్యోగులు ఉపక్రమించారు.

# నిలకడగా గోదారి

### 19 గంటలు.. 12.10 అడుగుల నీటిమట్టం


తగ్గిన వరద : ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నిలకడగా గోదావరి

- సాధారణస్థాయికి వరద ప్రవాహం
- భద్రాచలంలో మొదటి హెచ్చరిక ఉపసంహరణ
- ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం పట్టిన వరద
- 11.75 అడుగులకు తగ్గితే ఇక్కడా ఉపసంహరణ
- 5 నుంచి పంట నష్టం వివరాలు ప్రకటన

రాజమహేంద్రవరం,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి)/ధవళేశ్వరం : గోదావరి నీటిమట్టం ధవళేశ్వరం వద్ద నిలకడగా కొనసాగుతోంది. 19 గంటల పాటు 12.10 అడుగుల వద్ద నిలకడగా ఉన్న నీటిమట్టం ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో 2 పాయింట్ల మేర స్వల్పంగా పెరిగి 12.30 అడుగుల వరకు చేరుకుంది. ఆపై గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి తగ్గడం మొదలుపెట్టి 3 గంటలకు 12.10 అడుగులకు చేరుకుని నిలకడగా కొనసాగుతోంది. రాత్రి 7 గంటలకు అదే 12.10 అడుగుల వద్ద నీటి మట్టం కొనసాగుతుండగా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 10,30,897 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. నీటిమట్టం మధ్యాహ్నం మూడు గంటల నుంచి 12.10 అడుగులుగా ఉంది. ఇది 11.75 కంటే తగ్గినా మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకుంటారు.రాత్రి 12 గంటలకు కోనసీమ జిల్లా మీదుగా దిగువకు 9,94,123 క్యూసెక్కులు పోతోంది. నీటిమట్టం 11.80 అడుగులుగా ఉంది. శుక్రవారం మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చ రికను ఉపసంహరించారు. గురువారం రాత్రి 8 గంటలకు నీటిమట్టం 39.80 అడుగులుగా ఉంది. ప్రస్తుతం సాధారణ వరద మాత్రమే కొనసాగుతోంది.అయితే లంకలు ఇంకా నీటి ముంపు నుంచి తేరుకోలేదు. పంట పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ప్రస్తుతం గోదావరి తగ్గడంతో లంకలో నీరు లాగడానికి మరో రెండు రోజులు పట్టవచ్చని అంచనా. ఇదిలా ఉండగా సుమారు 15 రోజుల వరద తర్వాత ఇసుక తిప్పలు వరద నుంచి బయట పడ్డాయి. జిల్లా పంట డ్యామేజిని ఈనెల 4వ తేదీలోపు అంచనా వేయనున్నారు. మరి కొంత నీటిమట్టం తగ్గితే ధవళేశ్వరం వద్ద సాధారణ స్థితికి చేరుకుంటుంది. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ముంపు ప్రాంతాల్లో పర్యటించి నష్టపరిహారంపై అంచనా వేస్తామని జిల్లా వ్యవసా యాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకూ రైతు సేవా కేంద్రాల వద్ద నష్టపోయిన రైతులు,పంట వివరాలు ప్రకటిస్తా మన్నారు. 12వ తేదీకి పూర్తి నష్టం నివేదికను కలెక్టర్ ఇస్తామన్నారు. మరో పక్క రెవెన్యూ, ఇతర శాఖలు ఎన్యుమరేషన్‌లో నిమగ్నమయ్యాయి.

## వారమంతా సదరం క్యాంపులు

- సీహెచ్‌సీల్లోనూ ఆర్థోపెడిక్ పరీక్షలు
- జీజీహెచ్‌లో వారానికి రెండు రోజులు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 1 : జిల్లా వ్యాప్తంగా సదరం క్యాంపులను నిర్వహించి ధ్రువపత్రాలు జారీ చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి వెల్లడించారు.ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సదరం సర్టిఫికెట్ కావాల్సిన వారు ముందుగా తమ పేర్లను గ్రామ సచివాలయాల్లో స్లాట్ కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. స్లాట్ కేటాయించిన తర్వాత వారికి కేటాయించిన తేదీల్లో వైద్య పరీక్షలకు హాజరుకావాల్సిందిగా సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుందన్నారు. సీహెచ్‌సీల్లో ప్రతి సోమవారం కొవ్వూరు, గోపాలపురం, మంగళవారం గోకవరం, కడియం, బుధవారం నిడదవోలు, రాజానగరం, గురువారం అనపర్తి సీహెచ్‌సీల్లో ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ప్రతి మంగళవారం, శుక్రవారం ఐదు విభాగాలకు సంబంధించిన సదరం క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.


ఎన్నికైన పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా కార్యవర్గ సభ్యులు

## పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా కార్యవర్గం

రాజానగరం, ఆగస్టు 1 : ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ మూర్తి గురువారం తెలిపారు.ఈ మేరకు వైజాగ్ శిల్పారామంలో బుధవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా మర్ల సీతారామశాస్త్రి(రాజా)(కోరుకొండ), గౌరవాధ్యక్షులుగా జ్యోష్యుల సుబ్రహ్మణ్యం(నిడదవోలు)ప్రధాన కార్యదర్శిగా ఆరాధ్యుల నరేం ద్రబాబు (సీతానగరం), గౌరవ సలహాదారుగా పురాణపండ జయలక్ష్మి మాధ వానంద్(రాజమహేంద్రవరం),అధికార ప్రతినిధిగా వెలివెంటి సత్యనాగ వరప్రసాద్ (ధవళేశ్వరం), కార్యనిర్వహణాధికారిగా మర్ల సుబ్రహ్మణ్య కౌండిన్య (కలవచర్ల), కార్యనిర్వహణ కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం (చాగల్లు), ప్రచార కార్యదర్శిగా కొత్తూరి వీరవెంకట సత్యనారాయణమూర్తి(అనపర్తి), యువజన విభాగ అధ్యక్షులుగా కోడూరి సాయి విశ్వనాథ మణికంఠ కిరణ్ శర్మ(నిడదవోలు), కార్యదర్శిగా కొత్తూరి వెంకట సుబ్బారావు(వేమగిరి), కోశాధికారిగా భవానీభట్ల శ్రీకాంత్ శర్మ(రాజానగరం) ఎన్నికయ్యారు.


## అందరికీ ఇసుక అందాలి

- ఎటువంటి లోటుపాట్లకు తావివ్వొద్దు
- ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా

నిడదవోలు/పెరవలి, ఆగస్టు 1: ఇసుక పంపిణీ విధానంలో ఎటువంటి లోటుపాట్లుకు తావులేకుండా.. ప్రజలు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. నిడదవోలు మండలం పెండ్యాల ఇసుక ర్యాంపు, పెరవలి మండలం ఉసులుమర్రు స్టాక్ పాయింట్‌ను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి గురువారం తనిఖీ చేసి మాట్లాడారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు నిర్వహించాలన్నారు. విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది జవాబుదారీతనం కలిగి ఉండి సమయపాలన పాటించాలన్నారు.లోకల్, నాన్‌లోకల్ అన్న పరిస్థితులు లేకుండా ఇసుక కోసం వినియోగదారుడు చేస్తున్న అభ్యర్ధనే ప్రామాణికంగా ఇసుక పంపిణీ విధానం అమలు చేయాలన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లా డుతూ జిల్లా ఇసుక రీచ్‌లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక అమ్మకాలను నిర్వహిస్తున్నామన్నారు. రీచ్‌లలో ఇసుక లభ్యతను బట్టి లైన్లో ఉండే వాహనాలకు టోకెన్లు జారీ చేస్తున్నట్టు చెప్పారు. సాయంత్రం 6 తరువాత ఎటువంటి లోడింగ్ జరగకుండా క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు.ఇసుక ఎగుమతి చేసుకోవడానికి వచ్చిన లారీ డ్రైవర్లు, ప్రజలను ఉసులుమర్రు స్టాక్‌పాయింట్ వద్ద సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.నరసింహులు,మైన్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పెండ్యాల ర్యాంపు వద్ద ముఖేష్‌కుమార్ మీనాతో మాట్లాడుతున్న కలెక్టర్

# అమ్మపాలు అమృతం



**తల్లిపాల వారోత్సవాల సందర్భంగా...**

అంబాజీపేట, ఆగస్టు 1: అమ్మ పాలు అమృతంతో సమానం. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో, వజ్ర సమానమైన రోగ నిరోధక శక్తి పొందాలంటే తల్లి పాలు పట్టించాల్సిందే. తల్లి పాలను పుట్టిన బిడ్డకు పడితే ఇద్దరికీ ఎన్నో లాభాలున్నాయి. ఎన్నో రకాల వ్యాధులు దరిచేరవు. ఇంతటి విశిష్టత కలిగిన తల్లిపాలను బిడ్డ ఎంత వయస్సు వచ్చే వరకు ఇవ్వాలి .. రోజుకు ఎన్నిసార్లు పట్టాలి.. ఎలా పట్టాలి.... తల్లిపాలు పుష్కలంగా రావాలంటే ఏం తినాలి.. ముర్రు పాలు ఎప్పుడు పట్టాలి.. ఇలా చాలా అంశాలపై అందరికీ అవగాహన ఉండదు. ఆధునిక కాలం అమ్మలకు ఈ విషయాలపై అవగాహన మరీ తక్కువ. ఇలాంటి అంశాలకు వారికి తెలియజేస్తూ తల్లిపాలు ప్రాముఖ్యతను చాటేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లి పాలు వారోత్సవాలను గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించనున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించడానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో నాలుగు రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఆరోగ్య శాఖ అనుబంధంతో ఈ కార్యక్రమాలను చేపట్టారు.

### ముర్రుపాలు తప్పనిసరి ఎందుకంటే...

- బిడ్డ పుట్టిన మొదటి అరగంటలోపు తల్లులకు వచ్చే పాలనే ముర్రుపాలు అంటారు.
- శిశువుకు ఇవి కచ్చితంగా పట్టాలి. దీనివల్ల రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకాహార పదార్థాలు అందుతాయి. ఇందులో మాంసకృత్తులు, విటమిన్-ఎ ఉంటాయి.
- వ్యాధులు రాకుండా బిడ్డను జీవిత కాలం కాపాడతాయి.
- శిశువు ప్రేగులను శుభ్రం చేసి మొదటి మల విసర్జనకు తోడ్పడతాయి.
- తల్లులు సహజంగా బిడ్డకు సరిపడా పాలు రావట్లేదని అనుకోవడం అపోహ మాత్రమే.
- బిడ్డ పుట్టగానే పాలు మూడు, నాలుగు రోజుల వరకు తేనె నాకించడం, పంచదార నీళ్ల ఇవ్వడం, గ్లూకోజ్ నీళ్ల ఇవ్వడం చేయకూడదు.
- ఆరు నెలల వరకు బిడ్డకు తప్పనిసరిగా రోజుకు ఎనిమిది నుంచి పదిసార్లు పాలు ఇవ్వాలి.

### తల్లిపాలు పుష్కలంగా రావాలంటే..

- గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లిపాయ, తాజా కూరగాయలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి. ఆహారంలో తీపి పదార్థాలు (స్వీటు కాదు) అంటే సహజంగా దొరికే పండ్లను శుభ్రంగా కడిగిన తర్వాత తినాలి.

**తల్లికి బోలెడు లాభాలు**

- చనుబాలు ఇవ్వడం వల్ల గర్భధారణ తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గడంతో పాటు తల్లులు త్వరగా కోలుకుంటారు. జీవితాంతం ఆరోగ్యం ఉంటారు. చనుబాలు ఇచ్చినందువల్ల ఊబకాయం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. గర్భానికి పూర్వం ఉన్న బరువును తిరిగి పొందగలుగుతారు.

### బిడ్డకు లాభాలివీ...

- తల్లిపాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి.
- నాణ్యమైన ప్రోటీన్లు అంది మెదడు వికసిస్తుంది.
- ఈ పాలలో బిడ్డలకు అవసరమయ్యే విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.
- ఇందులోని లాక్టోజ్ వల్ల కాల్షియం నిల్వలు పెరుగుతాయి. బిడ్డను రక్తహీనత నుంచి కాపాడుతాయి.
- తొలి నెలలో శిశువులను వివిధ రకాల అంటువ్యాధుల బారి నుంచి కాపాడుతాయి.
- బిడ్డ మనోవికాసానికి తోడ్పడతాయి. బిడ్డ మృదువైన మలవిసర్జనకు, మలబద్ధకం సమస్య నివారణకు తోడ్పడతాయి. జీర్ణ మండలాన్ని వృద్ధి చేస్తాయి.
- తల్లి పాల ద్వారా బిడ్డలను డయేరియా, న్యుమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడవచ్చు. క్యాన్సర్, చెవికి సంబంధించిన వ్యాధులు, గుండె జబ్బుల నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి.
- ఎలర్జీ, ఆస్తమా, డయాబెటిస్ వంటి వ్యాధులు రావు.
- బాల్యంలో, యవ్వనంలో ఊబకాయం వచ్చే ప్రమాదం తక్కువ.

### తల్లిపాల దినోత్సవం ఇలా మొదలైంది...

ఇటలీ దేశంలోని ఫ్లోరెన్స్ నగరంలో ఇన్నోసెంటి సెంటర్లో 1990 జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు అంతర్జాతీయ సమావేశం జరిగింది. తల్లిపాల విశిష్టతను గుర్తించి ఏటా ఆగస్టు 1 నుంచి వారం పాటు తల్లిపాల వారోత్సవాలు జరుపుతున్నారు. తల్లిపాలపై తల్లుల్లో ఉన్న అపోహలను తొలగించి, తల్లిపాల గొప్పతనం చాటి చెప్పడం వీటి ప్రధానోద్దేశం.

### తల్లిపాలు శిశువుకు ఎంతో మేలు

పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలను ఆరు నెలల వరకు కచ్చితంగా ఇవ్వాలి. తల్లి నుంచి మొట్టమొదట వచ్చే పాలను పిల్లలకు ఇవ్వకూడదనే అపోహ ఉంది. కానీ అది సరైనది కాదు. మొదట మూడు రోజుల పాటు వచ్చే పాలలో (ముర్రుపాలు) కొలస్ట్రం ఉంటుంది. ఇది బిడ్డ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం. కొలస్ట్రంలో ప్రొటీన్ పాళ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి బిడ్డకు రోగ నిరోధక శక్తినిస్తాయి. తల్లి నుంచి బిడ్డకు ఇమ్యునోగ్లోబ్యులిన్స్ పాల ద్వారా బిడ్డకు చేరుతాయి. దీని పాజిటివ్ ఇమ్యూనిటీ అంటాం. దీంతో బిడ్డకు అంటువ్యాధులు రావు. మొదటి మూడు రోజులు కొలస్ట్రంతో కూడిన పాలు తాగని పిల్లలు విలువైన వ్యాధి నిరోధక శక్తిని కోల్పోతారు. తల్లిపాల ద్వారా ఎలాంటి వ్యాధులూ దరిచేరవు.



అంబాజీపేట మండలం తొండవరంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి

### గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తల్లి పాల శ్రేష్ఠతపై అవగాహన కల్పిస్తున్నారు. 46 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అప్పర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

**డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీఎంహెచ్‌వో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా**



డొక్కా సీతమ్మ నివాసంలో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నామన రాంబాబు

# డొక్కా సీతమ్మ సేవలు

## భావితరాలకు గుర్తుండిపోతాయి

**సీతమ్మ నివాసాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, కూటమి నాయకులు**

పి.గన్నవరం, ఆగస్టు 1: అపర అన్నపూర్ణగా ఖ్యాతిగాంచిన డొక్కా సీతమ్మ సేవలు భావితరాలకు గుర్తుండిపోయేలా కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయడం శుభపరిణామమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. రాబోయే తరాలకు ఆదర్శంగా ఉండేలా విద్యా శాఖలో పథకాలకు డొక్కా సీతమ్మ, సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం పేర్లు నిర్ణయిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గురువారం లంకల గన్నవరంలోని సీతమ్మ నివాసంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ నామన రాంబాబుతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీసుకునే నిర్ణయాలు చారిత్రాత్మకంగా ఉంటాయన్నారు. సీతమ్మ పేరు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందుతుందన్నారు. పి.గన్నవరం పాత అక్విడెక్టును పర్యాటక కేంద్రంగా మార్చే అంశాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టిలో ఉంచామని.... సీతమ్మ నివాసాన్ని కూడా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరతామన్నారు. నామన రాంబాబు మాట్లాడుతూ 2020లో బీజేపీతో భాగస్వామిగా ఉన్న సమయంలో పి.గన్నవరం అక్విడెక్టుకు డొక్కా సీతమ్మ పేరు పెట్టారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఈ నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. డొక్కా నాద్‌బాబు మాట్లాడుతూ 2019 ఎన్నికలతో పాటు ఈ ఎన్నికల్లో కూడా ప్రతి బహిరంగ సభలోనూ డొక్కా సీతమ్మ పేరును పవన్‌కల్యాణ్ ప్రస్తావించారని గుర్తు చేశారు. తొలుత సీతమ్మ నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీతమ్మ ఐదో తరం వారసుడు డొక్కా వెంకటభీమకామేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నామన రాంబాబులను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాద్‌బాబు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, వైస్ ఎంపీపీ చెల్లిబోయిన గంగాదేవి, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, అవనిగడ్డ సత్తిబాబు, బొంతు పెదబాబు, గణపతి వీరరాఘవులు, డొక్కా ప్రభాకరమూర్తి, శేరు శ్రీనుబాబు, త్సల్లా బిందుమాధవరావు, యర్రంశెట్టి తాత, గనిశెట్టి ఈశ్వర్, లంకే చిరంజీవి, యన్నాబత్తుల వెంకటేశ్వరరావు, బొరుసు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



సీతమ్మ ఐదో తరం వారసుడు భీమవెంకట కామేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కూటమి నేతలు

### దాళ్వా పంట సొమ్ములు వెంటనే చెల్లించాలి

**ఎమ్మెల్సీ ఐవీ రావు**

అమలాపురం టౌన్, ఆగస్టు 1: దాళ్వా పంట సొమ్ములు వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) డిమాండు చేశారు. ఇదే అంశాన్ని శాసనమండలి సమావేశాల్లో చర్చించామన్నారు. కోనసీమ జిల్లాకు రూ.154.63 కోట్లు, పశ్చిమ గోదావరికి రూ.424.55 కోట్లు, కాకినాడకు రూ.9.49 కోట్లు,తూర్పుగోదావరి, బాపట్ల జిల్లాలతో కలిపి మొత్తం రూ.647 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారన్నారు రైతులు సార్వా పంటకు సిద్ధమయ్యే తరుణంలో సొమ్ములు చాలా అవసరమని, బకాయిలను తక్షణం విడుదల చేయాలని కోరారు. ఒక్క అమలాపురం రూరల్ మండలంలోనే 435 మంది రైతులకు రూ.5.63 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు.

# ప్రజా నాయకులకు మరణం లేదు

**నల్లమిల్లి మూలారెడ్డి ద్వితీయ వర్ధంతి సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు**

అనపర్తి, ఆగస్టు 1: ప్రజల మనస్సుల్లో గూడు కట్టుకున్న నాయకులకు మరణం లేదని వారు ఎల్లప్పుడూ ప్రజల హృదయాల్లో జీవిస్తూనే ఉంటారని పలువురు నాయకులు పేర్కొన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా జరిగిన పలు కార్యక్రమాల్లో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, కార్మిక శాఖ వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనపర్తి మండలం రామవరంలో నల్లమిల్లి నివాసంలో స్పీకర్ అయ్యన్న, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.. మూలారెడ్డి చిత్రపటానికి, గ్రామంలోని విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరు నాయకులు ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పథకంలో పింఛన్లను పంపిణీ చేశారు. స్పీకర్ మాట్లాడుతూ నిబద్ధత కలిగిన ప్రభుత్వం ఏర్పడితే ప్రజల మోములో చిరునవ్వు వికసిస్తూనే ఉంటుందన్నారు. పెంచిన పింఛను రెండో నెలలో పంపిణీ చేయలేరని వైసీపీ నాయకులకు కనువిప్పు కావాలని దిగ్విజయంగా గంటల వ్యవధిలోనే సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేసి ప్రభుత్వం సత్తా చూపుతుందన్నారు. మంత్రి ఆనం మాట్లాడుతూ ప్రజలకు కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా పయనిస్తోందని, హామీలు వంద శాతం పూర్తి చేయగల సత్తా చంద్రబాబుకు ఉందన్నారు.

బిక్కవోలు మండలం పందలపాకలో ఏర్పాటు చేసిన నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాన్ని స్పీకర్ అయ్యన్న, మంత్రి ఆనం, ఎమ్మెల్యే నల్లమిల్లి ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు.



రామవరంలో మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి




వివాహాలు చేయించే పురోహితుల పేర్లు, సెల్ నెంబర్లతో ఏర్పాటు చేసిన బోర్డు

## అన్నవరం దేవస్థానంలో వివాహ దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

**వివాహాలు చేయించే పురోహితులు, నాయీ బ్రాహ్మణుల పేర్లతో బోర్డులు**

అన్నవరం, ఆగస్టు 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో కొన్ని దశాబ్దాలుగా వేళ్లూనుకుపోయిన వివాహ దళారీ వ్యవస్థకు చెక్ పెట్టేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వివాహాల పేరుతో దళారులు భక్తుల నుంచి వేలాది రూపాయలు దోచేస్తున్నారని పలు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో అన్నవరం దేవస్థానంలో వివాహాలు చేయించే 57 మంది పురోహితులు, 33 మంది సన్నాయి, భజంత్రీలు వాయించే నాయీబ్రాహ్మణుల పేర్లు, వారి ఫోను నంబర్లను వివాహాలు జరిగే ప్రదేశాల్లో బోర్డులు రూపంలో ఏర్పాటుచేశారు. వీటిని సీఆర్వో, పీఆర్వో, శివసదన్, హరిహర సదన్ కాటేజీల వద్ద పెడుతున్నట్టు అధికారులు వెల్లడించారు. వివాహ బృందాలు దళారుల ప్రమేయం లేకుండా వారితో నేరుగా మాట్లాడుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ధరలను కూడా దేవస్థానం నిర్ణయిస్తే బాగుంటుందని వివాహ బృందాలు పేర్కొంటున్నాయి.





వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకుంటున్న అయ్యన్నపాత్రుడు

### తంటికొండ వెంకటేశ్వరస్వామికి స్పీకర్ ప్రత్యేక పూజలు

గోకవరం, ఆగస్టు 1: తంటికొండ వేంకటేశ్వరస్వామిని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి దేవస్థానం అధికారులు స్వామి ప్రసాదం అందించారు. టీడీపీ నాయకులు మంగరౌతు రాము, జనపరెడ్డి సుబ్బారావు, పాలూరి బోస్, ఎస్వీఎస్ అప్పలరాజు, దాసరి తమ్మన్నదొర, కన్నబాబు, అడపా భరత్, ఉంగరాల రాము, పోసిన ప్రసాద్, బదిరెడ్డి అచ్చన్నదొర, గెడ్డం బాబు, పెద్దాడ వెంకన్నదొర, మలిరెడ్డి సిరి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### వాగు నీటిలో పడి వ్యక్తి మృతి

చింతూరు, ఆగస్టు 1: వరద ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం ఉలుమూరులో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... పూసం రాజయ్య (60) గేదెలకోసమని ఇంటి నుంచి శబరి ఒడ్డుకు గురువారం ఉదయాన్నే బయల్దేరాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో రాజయ్య కుటుంబీకులతో పాటు గ్రామస్తులు మధ్యాహ్న సమయంలో పరిసర ప్రాంతాల్లో వెతికారు. గ్రామ సమీపంలోని వాగు నీటిలో కూడా గాలించారు. చివరకు వాగు నీటిలో మృతదేహం బయటపడింది. శబరి ఒడ్డుకు వెళ్లే క్రమంలో వాగు దాటబోయి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. రాజయ్య మృతదేహాన్ని అతడి ఇంటికి తరలించారు. జరిగిన ఘటనపై రెవెన్యూ పోలీసు అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు.



రాజయ్య మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చుతున్న గ్రామస్తులు, రాజయ్య (ఇన్‌సెట్‌లో)

### గొల్లపాలెంలో గంజాయి బ్యాచ్ అరెస్టు

మలికిపురం, ఆగస్టు 1: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం పోలీసు స్టేషన్ పరిధిలోని గొల్లపాలెంలో గంజాయి తాగుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. గంజాయి సేవిస్తున్న ఎనిమిది మంది యువకుల్లో ఒకరు పారిపోగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 700 గ్రాముల గంజాయి సీజ్ చేశారు. నిందితుల్లో ఒకరిని మైనరుగా గుర్తించారు. కేసు నమోదుచేసి నిందితులను రాజోలు కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ చెప్పారు.

### మరిడమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, ఆగస్టు 1: మరిడమ్మ జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లలో భక్తుల సౌకర్యం కోసం పలు ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆరువేలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాలు తెలియజేశారు.



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

### ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితా రూపకల్పన

- ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఓటర్ల నమోదుకు అవకాశం
- దరఖాస్తుల స్వీకరణకు ఆఖరు తేదీ సెప్టెంబరు 3

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 1: ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితా రూపకల్పనకు ఫారం-19 దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గత నెల 29న ఈ ప్రక్రియ ఆరంభమైంది. ఓటర్లుగా నమోదుకు ఉపాధ్యాయులు సెప్టెంబరు 3 వరకు తమ దరఖాస్తులను అధికారులకు అందజేయాల్సి ఉంది. ఏపీ శాసనమండలిలో ఉన్న తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రూపొందిస్తున్నారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఈవోఆంధ్ర.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫారం-19లో వివరాలు నింపాలని కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్ తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో పాటు ప్రిన్సిపాళ్ల ధ్రువీకరించిన దరఖాస్తు సమర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రిన్సిపాళ్లతో పాటు డీఈవో గానీ, ఆర్‌ఐవో గానీ, ఆర్‌జేడీగానీ తప్పనిసరిగా కౌంటర్ సంతకం చేయాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు వివరాలు సమర్పించాలన్నారు. వివరాలకు వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.



### మెసేజ్ ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతాలో నగదు మాయం

**లబోదిబోమన్న మహిళ పోలీసులకు ఫిర్యాదు... సైబర్ నేరంపై కేసు నమోదు**

అంబాజీపేట, ఆగస్టు 1: ఓ మహిళ సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు పంపించిన మెసేజ్ ఓపెన్ చేయడంతో ఆమె ఖాతాల్లో ఉన్న రూ.2.20 లక్షలు మాయమయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లికి చెందిన వేదుల కిరణకుమారి మొబైల్‌కు గత నెల 16వ తేదీన తెలియని మెసేజ్ వచ్చింది. దానిని ఓపెన్ చేయగా 18న ఆధార్‌తో కూడిన ఓటీపీలు వచ్చాయి. అదేరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ఆమె ఖాతాలో ఉన్న నగదు దశల వారీగా కట్ అయ్యాయి. వెంటనే ఆమె పుల్లేటికుర్రులోని యూనియన్ బ్యాంకుకు వెళ్లి అధికారులకు సమాచారం ఇచ్చింది. ఆమె ఖాతా నుంచి మూడు దఫాలుగా రూ.1.50 లక్షలు రూ.50వేలు, రూ.20,500 గుర్తు తెలియని వ్యక్తికి బదిలీ అయినట్టు తెలిపారు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. సైబర్ నేరంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు.

## ఏజెన్సీ సమాచారం

## పేదలు, వృద్ధుల సంక్షేమమే లక్ష్యం



పింఛను సొమ్ము అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, ఆగస్టు 1: పేదలు, వృద్ధులు, బలహీన వర్గాలు, రోగపీడితుల సంక్షేమమే కూటమి లక్ష్యమని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. గురువారం రంపచోడవరం, గంగవరం మండలాల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. రంపచోడవరం మండలం రంప, ఐ.పోలవరం గ్రామాల్లో వృద్ధులకు పింఛన్లు అందజేశారు. అనంతరం గంగవరం మండలం నెల్లిపూడి, అడ్డతీగల మండలం గొండోలు, నాయుడుపాకలు, ఎల్లవరం గ్రామాల్లోనూ పింఛన్లు పంపిణీ చేశారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, టీడీపీ నాయకులు అడబాల బాపిరాజు, పెంటపాటి మోహన్ సలాది బాపిరాజు, పండా చెల్లన్నదొర తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు సిరిగిందలపాడులోను, చిన్నం బాబూరమేష్ ఇర్లపల్లి గ్రామంలోను పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.





పింఛన్లు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి, బాబూరమేష్

## మన్యంలో 48 వేల సామాజిక పింఛన్ల పంపిణీ



రంపచోడవరం, ఆగస్టు 1: మన్యంలోని 11 మండలాల్లో గురువారం రాత్రి పొద్దుపోయేసరికి అందిన సమాచారం ప్రకారం సుమారు 48వేల మందికి రూ.20 కోట్ల మేర సామాజిక పింఛన్లు అందజేశారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం రంపచోడవరం, గంగవరం మండలాల్లో పింఛన్లు పంపిణీ చేశారు.

## సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు రూ.10వేల పింఛను



మోతుగూడెం, ఆగస్టు 1: డొంకరాయి పంచాయతీ పరిధిలో సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న కిముడు చైతన్య, లండా అనిల్‌కుమార్‌లకు కూటమి ప్రభుత్వం పింఛను మంజూరు చేసింది. వారిద్దరికీ రూ.10వేలు చొప్పున ఎంపీటీసీ కరకా వెంకటరమణ అందజేశారు. ఎమ్మెల్యే మిరియాల శిరిషదేవి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు వ్యాధిగ్రస్తుల పిల్లల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ ఉప సర్పంచ్ నాగ్ జయదాస్, వార్డు సభ్యులు నీలాపు సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ గంగిరెడ్ల గురుమూర్తి, తాలికోర, లక్కరాజు అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దేవీపట్నంలో...



చింతూరు మండలం మల్లెతోటలో

## వాగులు దాటి...

దేవీపట్నం, ఆగస్టు 1: మండలంలోని పాముగండి పంచాయతీ దొనలంక గ్రామంలో జోరు కాలువ దాటుకుని మరి సర్పంచ్ కోంట్ల శివారెడ్డి, మాజీ సర్పంచ్ కోసు లచ్చన్నదొర, సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేశారు. కాలువ ఉధృతి వల్ల చాలాసార్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇక్కడ రహదారి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరినట్టు వారు చెప్పారు. ఇందుకూరు-1 ఏనుగులగూడెంలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

**చింతూరు:** వరద నేపథ్యంలో మండలంలోని ఎజికొడేరు, ముకునూరు, పెద్దసీతనపల్లి, చదలవాడ, రామన్నపాలెం, కల్లేరు పంచాయతీల పరిధిలోని గ్రామాలకు కార్యదర్శులు, సిబ్బంది నాటు పడవలపై వాగులు దాటి పింఛన్లు అందజేశారు.

**రాజవొమ్మంగి:** మండలంలో గురువారం రాత్రికి 94 శాతం పెన్షన్ పంపిణీ పూర్తయ్యిందని ఎంపీడీవో యాదగిరేశ్వరావు తెలిపారు. మొత్తం 6,464 మందికి 6,074మందికి పెన్షన్‌ను సచివాలయ సిబ్బందితో పాటు ఎంపీడీవో గ్రామాల్లో తిరుగుతూ పంపిణీ చేశారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, జనసేన మండల శాఖ అధ్యక్షుడు బొది రెడ్డి త్రిమూర్తులు, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, సొసైటీ మాజీ అధ్యక్షుడు గణజాల తాతారావు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

### స్కూలు ముందు నడవలేకపోతున్నాం...

## రోడ్డు వేయించండి జేసీ సారూ!



ఎటపాక, ఆగస్టు 1: 'మా స్కూలు ముందు అధ్వానంగా ఉన్న రోడ్డుపై వర్షాకాలంలో నడవలేకపోతున్నాం... ఒక్కోసారి ప్రమాదవశాత్తు బురద రహదారిపై పడిపోతున్నాం... స్కూలు ముందు రహదారి వేయించండి' అంటూ జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్‌కు ఏడో తరగతి విద్యార్థిని కణితి రేష్మశ్రీ విన్నవించింది. గురువారం ఓ కార్యక్రమం నిమిత్తం లక్ష్మీపురం వచ్చిన ఆయన ఆకస్మాత్తుగా పక్కనే ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని సమస్యలను విద్యార్థిని జేసీకి వివరించింది. ప్రహరీ లేకపోవడంతో పశువులు లోపలికి ప్రవేశిస్తున్నాయని, మంజూరు చేయాలని కోరారు. స్పందించిన జేసీ ప్రతిపాదనలు పంపాలని, సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మురళీకృష్ణను ఆదేశించారు. గొమ్ముకొత్తగూడెం ఎంపీటీసీ పాయం దేవి, టీడీపీ నాయకుడు కణితి మధు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు: డీఎఫ్‌వో



రాజవొమ్మంగి, ఆగస్టు 1: అటవీ ప్రాంతాన్ని ఎవరైనా ఆక్రమించినా, ఆక్రమించే వారికి సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని స్క్వాడ్ డీఎఫ్‌వో త్రిమూర్తులు రెడ్డి అన్నారు. గురువారం ఆయన బరద నాంపల్లి రిజర్వ్ ఫారెస్టు పరిధిలోని 1965, 1966, 1967 టేకు ప్లాంటేషన్లను, బరదనాంపల్లిలో గత ఏడాది వేసిన టేకు ప్లాంటేషన్లను తనిఖీ చేశారు. అనంతరం రాజవొమ్మంగి అటవీ శాఖ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడితే ఉపేక్షించేది లేదన్నారు. ఉర్లకులపాడులో టేకు నర్సరీని పరిశీలించారు. అటవీ రేంజ్ అధికారి అబ్బాయి దొర, ఎఫ్ఎస్‌వో రాము, రైటర్ మధు తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు ఉచిత బియ్యం పంపిణీ

వరరామచంద్రపురం, ఆగస్టు 1: వీఆర్ పురం డీఆర్ డిపో ద్వారా వడ్డిగూడెం గ్రామ పంచాయతీలోని వరద బాధితులకు, మండలంలోని వరద బాధితులకు బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తహసీల్దారు సయ్యద్ మౌలినాపాజిల్ తెలిపారు. వరదల నేపథ్యంలో గత పది రోజులుగా నిత్యావసరాలు, రేషన్ సక్రమంగా అందిస్తున్న డీఆర్ డిపో సేల్స్‌మెన్ గొర్రె రామారావును బాధితులు అభినందిస్తున్నారు.

# సిబ్బంది పనితీరు అభినందనీయం

» పింఛన్ల పంపిణీలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి



దివాన్‌చెరువులో వృద్ధుడికి పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

దివాన్‌చెరువు, ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సిబ్బంది పనితీరు అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజానగరం మండలం దివాన్‌చెరువులో గురువారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. పోసుపు గంగరాజు అనే వృద్ధుడికి పింఛను సొమ్ముతోబాటు రశీదును అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడితో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో జ్యోతిర్మయితో పింఛన్లు పంపిణీ తీరుపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టరు పర్యటించిన దివాన్‌చెరువు-2 సచివాలయం పరిధిలో 404 పెన్షన్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, జనసేన నాయకులు అక్కిరెడ్డి వేణు, యర్రంశెట్టి శ్రీను, ముప్పనపల్లి సురేష్, గంగిశెట్టి చంటిబాబు, వంక మల్లిబాబు, ఖండవిల్లి లక్ష్మి, మల్లారపు సత్యానందం, దాసరిశ్రీను, కందుల బాబూరాయుడు పాల్గొన్నారు.

**కోరుకొండ:** మండలంలోని గాదరాడలో జోరున వర్షం పడుతున్నప్పటికీ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పలువురు వృద్ధుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. పింఛన్‌ను కూటమి ప్రభుత్వం రూ.4 వేలు చేయడంతో లబ్ధిదారులు ఎమ్మెల్యే బత్తులకు కృతజ్ఞతలు తెలిపారు.



గాదరాడలో లబ్ధిదారురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

**కడియం:** వీరవరంలో జరిగిన కార్యక్రమంలో జనసేన నాయకుడు ఆదిమూలం సాయిబాబా పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటలక్ష్మిదేవీ, లంక సత్తిబాబు, కొవ్వుల నాని, దూళ్ళ ప్రసాద్, ఆకుల నాని, కేబుల్‌నాగు, ఎ.వీరవెంకన్న పాల్గొన్నారు.

**రాజమహేంద్రవరం రూరల్:** ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదేశాల మేరకు టీడీపీ రాష్ట్ర హెల్త్‌వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని శాటిలైట్ సిటీ ఏ బ్లాక్, రాజమహేంద్రవరం రూరల్ వార్డులైన 17లో ఐఎల్‌టీడీ, బొగ్గుల దిబ్బలోను, 18లో ఐదుబళ్ల మార్కెట్ పాలిక వీధిలోను, 19లో కొండా వారి వీధిలోను, 20లో గోకుల వీధిలోను, 26లో ఇన్నీసుపేట చాలుమూరు వారి వీధిలోను, 27లో వీటి కాలేజీ రోడ్డులోను, 28వ వార్డులో మంగళవారపు పేట కొబ్బరికాయల మార్కెట్ వద్ద పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ పేదలకు సహకరించాలి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 1: పేద విద్యార్థులకు సీనియర్ సిటిజన్స్ సహకారం అందించాలని అశోక్ కుమార్ జైన్ అన్నారు. స్థానిక కంబాలచెరువు ఏబీ నాగేశ్వరరావు పార్కు సీనియర్ సిటిజన్స్ భవనంలో బుధవారం ప్రజాసంక్షేమ వేదిక ఆధ్వర్యంలో గురువారం సీనియర్ సిటిజన్స్ పుట్టినరోజు కార్యక్రమాలు నిర్వహించారు. డేకేర్ భవనంలో వాటర్ కూలర్‌కు రూ.10 వేలు విరాళం ఇచ్చిన రెడ్డి రామ్మోహన్‌నాయుడుని అభినందించారు. కార్యక్రమంలో మహంతి లక్ష్మణరావు, కాసాని శంకరరావు, బండి నరేంద్ర, గంతకూర అప్పారావు పాల్గొన్నారు.

# జీవో 84ను రద్దు చేయాలి

» ఎమ్మెల్యే ఆదిరెడ్డికి ఎస్టీయూ నాయకుల వినతి



రోడ్డు పనులకుశిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 1: మునిసిపల్ ఉపాధ్యాయులకు నష్టం కలిగిస్తున్న జీవో 84ను రద్దు చేయాలని ఎస్టీయూ నాయకులు కోరారు. రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామరాజుతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ నగర అధ్యక్షుడు ఏ.విశ్వేశ్వరరరావు, రాష్ట్ర కన్వీనర్ ఏ.సూరిబాబు, ప్రధాన కార్యదర్శి దాసరి శివసత్యమూర్తి, ఆర్థిక కార్యదర్శి ఎస్ఎన్.సుబ్రహ్మణ్యం, కే.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన...** స్థానిక జాగృతి బ్లడ్ బ్యాంక్ సెంటర్ నుంచి షెల్టాన్ హోటల్ జంక్షన్ వరకు రూ.80 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలు తమ అవసరాల నిమిత్తం జాగృతి బ్లడ్ బ్యాంక్ సెంటర్ నుంచి షెల్టాన్ సెంటర్ వరకు రోడ్డు రద్దీగా ఉంటుందన్నారు. కానీ గత ప్రభుత్వం ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి రూ.80 లక్షలతో 1500 మీటర్ల రహదారి నిర్మాణ పనులు చేపడతారని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, కార్పొరేషన్ ఎస్ఈ జి.పాండురంగరావు, కూటమి నాయకులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## తల్లి పాలు అమృత తుల్యం

### తల్లి పాల వారోత్సవాల్లో డాక్టర్ వెంకటలక్ష్మి



రాజానగరంలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజానగరం, ఆగస్టు 1: తల్లి పాలుతో పుట్టిన బిడ్డకు అమృత తుల్యమని రాజానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకటలక్ష్మి అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా పీహెచ్‌సీ ఆవరణలో వారోత్సవాల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలు పుట్టిన బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు తల్లికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. శిశు మరణాల నిర్మూలించాలంటే పుట్టిన బిడ్డకు ఆరు మాసాలు పాటు తల్లి పాలు ఇవ్వాలన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లోని మహిళలకు తల్లి పాల ఆవశ్యకతను వివరించాలని ఏఎన్ఎంలకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎన్‌వీవీ రమణ, ఏఎన్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

**సీతానగరం:** సీతానగరంలో జరిగిన అవగాహనా కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఏవీకె చైతన్య మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లికి వచ్చే ముర్రిపాలు బిడ్డకు తప్పనిసరిగా తాగించాలన్నారు. బ్రెస్ట్ మిల్క్ బెస్ట్ మిల్క్ నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రాజు, సీహెచ్‌వో వెంకటరత్నం, ఎంపీహెచ్ఈవో యర్రా సుబ్బారాయుడు, సూపర్‌వైజర్లు సుధాకర్, దైవకృప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 'కల్వచర్ల' నుంచి నీరు విడుదల

కోరుకొండ, ఆగస్టు 1: మండలంలోని గాదరాడ గ్రామ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన కల్వచర్ల ఎత్తిపోతల పథకం నుంచి ఆయకట్టు రైతులకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గురువారం సాగునీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రాజెక్టు వద్దకు పోలవరం కాలువ గట్టుమీదకు స్వయంగా ట్రాక్టర్‌ను నడుపుకుంటూ రైతులతో కలిసి చేరుకున్నారు. పూజలు చేసి స్విచ్ ఆన్‌చేసి నీరు విడుదల కార్యక్రమంలో సర్పంచ్ దూది కాంతారావు, కూటమి నాయకులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## శాకంబరిగా బాలాత్రిపుర సుందరి



ధవళేశ్వరం, ఆగస్టు 1: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అందజేసిన టన్నుకు పైగా వివిధ రకాల కూరగాయలు, పళ్ళ రకాలతో ఆలయార్చకుడు విశ్వనాథశర్మ అమ్మవారిని అలంకరించారు. శివలింగం, డ్రాగన్ రూపం చూపరులను ఆకట్టుకున్నాయి. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

**కడియం:** వేమగిరి ముత్యాలమ్మ గురువారం భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. కొప్పిశెట్టి నాగేశ్వరరావు సమకూర్చిన వివిధ రకాల కూరగాయలు, ఫలాలుతో భక్తులు, ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారిని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, వాశంశెట్టి నాగబాబు, ప్రగడ పెదబాబు, వెలుగుబంటి ముత్యాలరావు దర్శించుకున్నారు.

## భావాభ్యుదయ కవిత్వాన్ని ఆవిష్కరించిన తిలక్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 1: శ్రీశ్రీ, కృష్ణశాస్త్రిల ప్రభావంతో భావాభ్యుదయ కవిత్వాన్ని ఆవిష్కరించిన మానవతావాది తిలక్ అని ఎస్‌కేఆర్ డీఎడ్ మహిళా కళాశాల తెలుగు శాఖాధిపతి విశాలాక్షి అన్నారు. కళాగౌతమి, ఎస్‌కేవీటీ తెలుగుశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తిలక్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మాలిన్యం మనసులో ఉన్నా మల్లెపువ్వులా నవ్వగలగడం నేటి తెలివి అన్న తిలక్ మాటలు గుర్తుంచుకోవాలన్నారు. తిలక్ మాదిరిగా ఆధునిక వచన కవిత్వంలో సరళ సుందర సంస్కృత సమాసాలు వాడిన వారు లేరనే చెప్పాలన్నారు. తెలుగుశాఖాధిపతి పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ గోదావరి జిల్లాల్లోని సంస్కారం, సంపన్నత, చదువు అన్నీ తిలక్ జీవితంలో తొంగి చూశాయన్నారు. సమావేశంలో ఎస్.రాజ్‌కుమార్, పల్లి సుధా తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### వైసీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



సీతానగరం: రాపాకలో ముంపుకు గురైన భూములను పరిశీలిస్తున్న రాజా

సీతానగరం/కోరుకొండ, ఆగస్టు 1: అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. గురువారం ఆయన సీతానగరం మండలం కాటవరం, చినకొండేపూడి రాపాక, కోరుకొండ మండలం కోటి, శ్రీరంగపట్నం, కూనవరం, మునగాల, బుచ్చింపేట గ్రామాల్లోని నీట మునిగిన పంట పొలాలను ఆయా గ్రామ రైతులతో కలిపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో అధిక వర్షాలు కురవడం వలన సీతానగరం, కోరుకొండ మండలాలలో వేలాది ఎకరాలునీట మునిగాయన్నారు. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం సీతానగరం మండలంలోని 16 గ్రామాల పరిధిలో 3545 హెక్టార్లలోను, కోరుకొండ మండంలలోని 8 గ్రామాల పరిధిలో 580 హెక్టార్లలోను పంట నష్టం వాటిల్లిందన్నారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ.91 కోట్లతో తొర్రిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీమ్ వైసీపీ పాలనలో తీసుకురావడం జరిగిందన్నారు. ఆ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. అదే విధంగా ముంపు సమస్యకు పరిష్కారంలో భాగంగా మైనర్ ఇరిగేషన్ పనులు నిమిత్తం మరో రూ.38కోట్లు కూడా మంజూరయ్యాయని, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు.ఆ పనులు చేపట్టే చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు భరోసా కల్పిస్తూ వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## స్పీకర్‌ని కలిసిన ఎస్పీ కిషోర్



రాజమహేంద్రవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాకు విచ్చే సిన శాసన సభాపతి చింత కాయల అయ్యన్న పాత్రుడు, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, వాసంశెట్టి సుభాష్‌లను ఎస్పీ నరసింహ కిషోర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## అన్ని విభాగాలకు ఈ-ఆఫీస్ అమలు చేయాలి

### జనన-మరణ నమోదు విభాగం తనిఖీలో కమిషనర్ కేతన్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 1: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాలకు ఈ-ఆఫీస్ విధానం అమలు చేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. నగరపాలక సంస్థ జనన-మరణ నమోదు విభాగాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. సిబ్బంది జవాబుదారి తనంతో విధులు నిర్వహించాలన్నారు. కార్యాలయంలో ప్రతి దస్త్రం ఈ- ఆఫీస్‌లో నిర్వహించాలన్నారు. జనన-మరణ ధ్రు వీకరణ పత్రాలకు వచ్చేవారికి ఎటువంటి అసౌకర్యం కల్పించకుండా చూసుకోవాలన్నారు. కార్యాలయానికి వచ్చే పిటిషన్‌దారులకు తగిన సహకారం ఇవ్వాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేస్తే సహించబోనని తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శిని కలిసిన కమిషనర్



పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనాను రాజమహేంద్రవరం కమిషనర్ కేతన్ గార్గ్ మర్యాదపూర్వకరంగా కలిశారు. గురువారం రాజమహేంద్రవరం వచ్చిన ముఖేష్ కుమార్‌కు మొక్కను అందించారు.

### ఇళ్ల పట్టాల పంపిణీపై ప్రభుత్వ

## మార్గదర్శకాల మేరకు చర్యలు

● జిల్లా కలెక్టర్ ప్రశాంతి

దివాన్‌చెరువు, ఆగస్టు 1: పంపిణీ కాని ఇళ్ల పట్టాలపై ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. దివాన్‌చెరువులో ఎన్టీఆర్ భరోసా పింఛనును పంపిణీ కార్యక్రమంలో గురువారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళికి ముందు సేకరించిన భూములకు సంబంధించి ఆర్డీవో ఇచ్చిన నివేదిక ప్రకారం రాజమహేంద్రవరం అర్బన్, గ్రామీణ నియోజకవర్గాల్లో 3,800 ఇళ్ల పట్టాలు పంపిణీ చేయవలసి ఉందన్నారు. ఈ విషయమై ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజానగరం పీహెచ్‌సీ విషయమై విలేకరులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆ పీహెచ్‌సీ 24 గంటల ఆసుపత్రి కావున నిరంతరం ఒక వైద్యుడు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ విధమైన ఫిర్యాదులు రావడంతోనే తాను నల్లజర్ల పీహెచ్‌సీని సందర్శించినట్టు చెప్పారు. రాజానగరం-కాకినాడ ఏడీబీ రహదారి గోతులమయంగా మారడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి విలేకరులు తీసుకెళ్లగా ఆ రహదారిపై పనులు జరుగుతున్నాయని చెప్పారు. కలెక్టర్ వెంట ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎం.సునీత, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఎంఈవో-2 జ్యోతిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కె.కుమార్, మండల ప్రత్యేకాధికారి బి.బాలస్వామి తదితర్లు పాల్గొన్నారు.

### సూపర్‌సిక్స్ పథకాల అమలుకు ప్రభుత్వం కృషి: బీవీఆర్

ఎన్నికల హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. దివాన్‌చెరువులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15న మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభం కానున్నదని చెప్పారు. రాజానగరం మండలంలో 15,500 మందికి పింఛన్లు కింద రూ6.50 కోట్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



ర్యాలీని ప్రారంభిస్తున్న నన్నయ ఇన్‌చార్జి వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, ఆగస్టు 1: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ వర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ రక్షణపై గురువారం అవగాహన ర్యాలీని వీసీ జెండా ఊపి ప్రారంభించారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని కన్వెన్షన్ సెంటర్ నుంచి గైట్ కళాశాల వరకూ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినపుడు హెల్మెట్ ఉంటే ప్రాణాలతో బయటపడవచ్చునన్నారు. యూనివర్సిటీలో ద్విచక్రవాహనదారులందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, పీవోలు ఎల్.సుజాత, ఎస్.రాజ్యలక్ష్మి, ఏఎం శిరీష, డి.అప్పలరాజు, ఎం.గోపాలకృష్ణ, రాజశేఖర్. ఎల్.ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

## బీఎస్ఎన్ఎల్ 4జీపై అవగాహన ర్యాలీ

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 1: బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు కస్టమర్ సర్వీస్ సెంటర్స్ దగ్గర 4జీ సిమ్ కార్డులుగా మార్చు కోవాలని రాజమహేంద్రవరం బిజినెస్ ఏరియా ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు తెలిపారు. వినియోగదారులు తమ 2జీ,3జీ కార్డులను 4జీ సర్వీసులుగా మార్చుకోవాలన్నారు. దీనిపై అవగాహనకు శుక్రవారం 11 గంటలకు గోకవరం బస్టాండ్ వద్ద గల నన్నయ సంచార్ భవన్ నుంచి పట్టణంలో ప్లకార్డులతో సీనియర్ అధికారులు, ఉద్యోగులు బైక్ ర్యాలీ ర్యాలీ చేస్తారన్నారు.

## ఉపాధ్యాయురాలి స్వచ్ఛంద పదవీ విరమణ

కడియం, ఆగస్టు 1: కడియం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయురాలు భావరాజు పద్మ స్వచ్ఛంద పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎంఈవో వైనాగేశ్వరరావు మాట్లాడుతూ ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన పద్మ టీచర్ సేవలు అభినందనీయమన్నారు. పుల్లా ఆంజనేయులు నర్సరీ యాజమాన్యం ఆమెను ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఆమె పాఠశాలకు బీరువాను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.సత్యనారాయణ, స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, పద్మ కుటుంబ సభ్యులు కామశాస్త్రి, వంశీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యాకమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

కోరుకొండ, ఆగస్టు 1: ప్రభుత్వం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పాఠశాల నోటీసు బోర్డులో ఓటర్ల జాబితాను ప్రకటించారు. ఈ నెల 5వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఓటర్ల తుది జాబితాను 5న పాఠశాల నోటీసు బోర్డులో ప్రకటిస్తారు. 8న ఎన్నిక నిర్వహించి అదే రోజు మధ్యాహ్నం కమిటీ సభ్యుల జాబితా ప్రకటిస్తారు. తదుపరి కమిటీ సభ్యులతో చైర్మన్, వైస్‌చైర్మన్లను నియమించి వారితో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఆపై మొదటి సమావేశం నిర్వహిస్తారు.





కొవ్వూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు

## పార్టీలకతీతంగా పనిచేస్తా.. స్పీకర్ పదవికి వన్నె తెస్తా

**స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

గోకవరం, ఆగస్టు 1 : రాజ్యాంగాన్ని గౌరవిస్తూ అసెంబ్లీలో పార్టీలకతీతంగా పనిచేసి స్పీకర్ పదవికి వన్నె తెస్తానని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సుమారు రూ.3.75 కోట్ల వ్యయంతో నిర్మించ నున్న గోకవరం-తంటికొండ ప్రధాన రహదారి నిర్మాణ పనులకు గురువారం ఆయన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి శంకు స్థాపన చేసి మాట్లాడారు. శాసనసభలో ప్రజా సమస్యలను ప్రస్తావించే ఎమ్మెల్యేలకు పార్టీల కతీతంగా ఎక్కువ సమయం కేటాయిస్తానన్నారు.స్పీకర్ పదవి చేపట్టాక మొట్టమొదటిగా తంటికొండ వెం కటేశ్వరస్వామివారిని దర్శించుకోవడం తాను అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల తీరుపై శాసనసభ నిబంధనలు ప్రకారం నడుచు కోవడం జరుగుతుం దన్నారు. గతంలో తాను ఏడు పర్యాయాలు మంత్రిగా పని చేయడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు హయాంలో రాష్ట్రం తిరిగి అన్ని విధాలా అభివృద్ధిలో పయనిస్తుందన్నారు.



తంటికొండలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

## ఫలించిన వర్గీకరణం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 1 : ఎస్సీ వర్గీకరణ సమంజసమేనంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల మాదిగలు సంబరాలు చేసుకున్నారు.. దీనిలో భాగంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్,మాజీ ఉపప్రధాని బాబూజగజ్జీవన్ రామ్, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కొవ్వూరులో ఎన్‌టీఆర్ పూలమాలవేసి కూటమి విజయమంటూ నినాదాలు చేశారు. రాజమహేంద్రవరంలో టీడీపీ మాజీ డిప్యూటి ఫ్లోర్ లీడర్ కోరుమిల్లి విజయశేఖర్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ ఉద్యమం 30 ఏళ్ళ పాటు సాగిందన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పురావడం ఆనందంగా ఉందన్నారు. ఇది మా భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు





రాజమహేంద్రవరంలో ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

## ప్రజా సమస్యలపై పోరాటం

### సీపీఐ జిల్లా సమావేశంలో కార్యవర్గ సభ్యురాలు వనజ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 1 : ప్రజా సమస్యలపై గ్రామస్థాయి నుంచి పోరాటం చేయాల్సి ఉందని, పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. రాజమహేంద్రవరంలో గురువారం జరిగిన సీపీఐ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో అనేక ప్రజా సమస్యలు రాజ్యమేలుతున్నాయని, వాటి పరిష్కారానికి పార్టీ కేడర్ కృషి చేయాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సీపీఐ దశలవారీ పోరాటం చేస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేశు అన్నారు. జగన్మోహనరెడ్డి నిరంకుశ విధానాల కారణంగానే వైసీపీ అడ్రస్ లేకుండా పోయిందన్నారు. పోలవరం ప్రాజెక్టు వేగవంతం, రాజధాని అమరావతి నిర్మాణం, విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణ తదితర సమస్యలపై ఇటీవల సీపీఐ బృందం సీఎం చంద్రబాబును కలిసినట్టు చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే 90 శాతం నిధులను కేంద్రమే ఇస్తుందని తద్వారా రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. రాజధాని అమరావతికి కేంద్రం ఇస్తానన్న రూ.15 వేల కోట్ల నిధులను గ్రాంటుగా ఇవ్వాలని లేదా బడ్జెట్‌లో సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ శత దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది డిసెంబరు 26 నుంచి వచ్చే ఏడాది డిసెంబరు 26వ తేదీ వరకూ ఏడాదిపాటు శత దినోత్సవం ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని పార్టీ జాతీయ సమితి పిలుపునిచ్చిందని వెల్లడించారు. ప్రజానాట్యమండలి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మహంతి లక్ష్మణరావు నాయకత్వంలో విప్లవ గీతాలు ఆలపించారు.కేరళలోని వయనాడ్ వరద బాధితులు, మృతులకు సీపీఐ తూర్పుగోదావరి జిల్లా తరపున రూ.10,120లు ఆర్థిక సహాయం అందించేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సహాయ కార్యదర్శి కూండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, జిల్లా కార్యవర్గసభ్యులు కె.జ్యోతిరాజు, చింతలపూడి సునీల్, కె.శ్రీనివాస్, పి.నాగేశ్వరరావు, టి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

### ఆర్అండ్‌బీ రోడ్లపై విగ్రహాలు ఏర్పాటు చేయవద్దు
### సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాల్సిందే : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : ఆర్అండ్‌బీ రోడ్ల మీద ఎటువంటి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వకూడదని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 2023 ఫిబ్రవరి 18న ఇచ్చిన జీవో నెంబర్ 18, ఆర్అండ్‌బీ శాఖ అదే ఏడాది ఏప్రిల్ 8న జీఎంఎస్ఎస్ నెంబర్ 55 ప్రకారం ఉత్తర్వుల విడుదల చేశాయన్నారు. గ్రామ, మండల స్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా విగ్రహాలు పెట్టనీయకూడదన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే సత్వర చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

### డిగ్రీ ప్రవేశాల్లో ఆప్షన్లకు 5 వరకూ గడువు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 1 : డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల వెబ్ ఆప్షన్ల నమోదుకు ప్రభుత్వం గురువారం నుంచి నుంచి 5వ తేదీ వరకూ అవకాశం కల్పించిందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఏ కళాశాలలో ఏ విభాగంలో సీటు కేటాయించబడిందో విద్యార్థులకు ఈనెల 10వ తేదీన తెలుపబడుతుందన్నారు. 12వ తేదీ నుంచి 16వ తేదీలోగా విద్యార్థులు తమకు కేటాయించిన కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు వెబ్ ఆప్షన్లను ఎంచుకోవడంలో ఎటువంటి సందేహాలున్నా ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాలులో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రంలో సంప్రదించవచ్చన్నారు.

## నిను మరువం మూలారెడ్డి




నల్లమిల్లి మూలారెడ్డిని మరువలేం.. ఆయనతో మాకు ఉన్న సాన్నిహిత్యం అటువంటిదని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మూలారెడ్డి ద్వితీయ వర్ధంతిని అనపర్తిలో గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పందలపాకలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాలలు వేసి ఆవిష్కరించారు. జోహార్ మూలారెడ్డి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. - **అనపర్తి**

## పింఛన్ల పంపిణీ సాగిందిలా..

| పింఛన్లు | పంపిణీ | సొమ్ము | శాతం | స్థానం |
|---|---|---|---|---|
| 2,40,595 | 2,36,607 | 100,43,40,500 | 97.90 | 5 |

# తొలిరోజే.. 97.9%



తాడిపర్రులో పింఛన్ అందిస్తున్న మంత్రి దుర్గేష్

- ఆనందించిన పింఛనుదారులు
- తెల్లవారుతుండగానే ఆరంభం
- రాత్రి 8 గంటల వరకూ పంపిణీ
- 4,200 మంది ఉద్యోగులు
- ఇంటింటికీ వెళ్లి అందజేత
- నేడు మిగిలిన వారికి పంపిణీ

## రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచిన తూర్పు

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

పింఛన్..కూటమి ప్రభుత్వంలో నో టెన్షన్.. ఒకటో తేదీ తెలవారుతుండగానే ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. గురువారం తెలవారుతుండగా ఉదయం 5 గంటలకే తలుపుతట్టి మరీ పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. జిల్లాలో సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు 4200 మంది పింఛన్ల పంపిణీలో భాగస్వాములయ్యారు. ఉద యం నాలుగన్నర గంటలకు తమకు అప్పగించిన ప్రాంతాలకు చేరుకుని పింఛన్లు ఆరంభించారు. తొలిరోజే ఏకంగా 97.90 శాతం పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం పింఛనుదారులు 2,40,595 మంది ఉండగా రూ.102 కోట్ల 54 లక్షల 77 వేల 500 సొమ్ము సమకూర్చారు. 3900 మంది సచివాలయ ఉద్యోగులు, 300 మంది ఇతర ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారు. గురువారం ఒక్కరోజే 2,36,607 మందికి 100 కోట్ల 43 లక్షల 40 వేల 500 సొమ్ము పింఛనుదారులకు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీలో ఐదో స్థానంలో నిలిచారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి 99 శాతం లక్ష్యంగా పెట్టగా దీని సాధన కోసం డీఆర్‌డీఏ పీడీ మూర్తి శ్రమించారు. అనేక చోట్ల లబ్ధిదా రులు నిద్రలేవకపోయినా సచివాలయ ఉద్యోగులు, కూట మి నాయకులు వాళ్ల తలుపు తట్టి పింఛన్లు ఇచ్చారు.ఈ నేపథ్యంలో లబ్ధిదారుల కళ్లలో ఆనందం కనిపించింది. పింఛను ఎవరు ఇస్తున్నారంటే వృద్ధులు చంద్రబాబు అని ఆనందంతో చెబుతుండడం గమనార్హం. మానసిక విక లాంగులదీ ఇదే పరిస్థితి.ఇదిలా ఉండగా జిల్లాలో కొంత మంది సచివాలయ ఉద్యోగులు నూరుశాతం పంపిణీ చేశారు. చాలా మంది ఊళ్లో లేకపోవడం, కొందరు చని పోవడం వంటి కారణాల వల్లే 2.10 శాతం పెండింగ్ పడింది. శుక్రవారం సాయంత్రానికి నూరుశాతం పూర్తి చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఊరికి వెళ్లిన వారికి ఫోన్లు చేసి మరీ రప్పిస్తున్నారు.జిల్లాలో గురువారం జరిగిన పింఛన్ల పంపిణీలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు కందుల దుర్గేష్, ఆనం వెంకటరామనారాయణ రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడంతో పాటు వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకోవడం గమనార్హం.కొంత మంది ఉద్యోగులు లక్ష్య సాధనకు రాత్రి 8గంటల వరకూ పింఛన్ల పంపిణీ చేయడం గమనార్హం.

### పింఛనుదారులతో సెల్ఫీ



రాజమహేంద్రవరంలో వృద్ధురాలికి కలెక్టర్ ప్రశాంతి పింఛను అందజేస్తుండగా సెల్ఫీ తీస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చిత్రంలో అనుశ్రీ సత్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 1 : పింఛన్ల పంపిణీ నూరుశాతం పూర్తి చేయాలని కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని 3,4 డివిజన్లకు సంబంధించి రాజేంద్రనగర్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 2,40,595 మందికి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు రూ.102 కోట్ల 55 లక్షలు అందజేస్తున్నా మన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో 30 వేల మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కమిషనర్ కేతన్ గర్గ్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ మేరకు పింఛనుదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తన సెల్‌లో కలెక్టర్ పంపిణీ చేస్తుండగా సెల్ఫీ తీసుకున్నారు.నగరంలో 6,21,24, 25,29,31,38,39 డివిజన్లలో కూటమి నాయకులు జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ నగర అధ్యక్షుడు యెనుముల రంగబాబు, టీఎన్‌టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నక్కా చిట్టిబాబు, శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు పంపిణీ చేశారు.

### నాడు వైసీపీ తొలగిస్తే నేడు ఇప్పించారు..



అనపర్తి, ఆగస్టు 1 : ప్రతిపక్ష పార్టీకి మద్దతుగా మాట్లాడిన నేరానికి గత ప్రభుత్వ హయాంలో అది కారం ఉంది కదా అని పింఛన్ నిలుపుదల చేయించారు.సుమారు 8 నెలలుగా ఎన్ని ఆఫీసుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఆ వృద్ధుడికి పింఛన్ పునరుద్ధరించారు. అంతే కాకుండా నిలుపుదల చేయించిన వైసీపీ నాయ కుడితోనే ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో బాధితుడికి పంపిణీ చేయించడం ఆసక్తిగా మారింది. అనపర్తి శివారు కొత్తూరుకు చెందిన గొలుగూరి సుబ్బా రెడ్డి ప్రతి నెల పింఛను పొందుతున్నాడు.8 నెలల కిందట గ్రామంలో పర్యటించిన అప్పటి ప్రతిపక్ష నాయకుడు నల్లమిల్లితో పెంచిన ధరలు,విద్యుత్ చార్జీలపై మొరపె ట్టుకున్నాడు. దీంతో గ్రామ వైసీపీ నాయకుడు సత్తి గం గిరెడ్డి అధికారులతో మాట్లాడి పింఛన్ నిలుపుదల చేయించాడు.బాధితుడు నల్లమిల్లిని ఆశ్రయించడంతో పింఛన్ కోసం పోరాటం చేశారు. వృద్ధుడిని మరింత బాధిస్తూ పింఛన్‌ను గండేపల్లి మండలానికి బదిలీ చేయించారు. దీంతో వృద్ధుడు 8 నెలలుగా పింఛన్ కోల్పోయాడు. ఎమ్మెల్యేగా గెలుపొందిన నల్లమిల్లి వెంటనే అధికారులతో మాట్లాడి సుబ్బారెడ్డి పెన్షన్ పునరుద్ధరిం చారు. గురువారం తెల్లవారుజామున కొత్తూరు చేరుకున్న ఎమ్మెల్యే గ్రామస్థుల సమక్షంలో పింఛన్ తొలగించిన వైసీపీ నాయకుడు గంగిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

### గోపాలపురంలో అత్యధికం

జిల్లావ్యాప్తంగా 19 మండలాల్లో పింఛన్ల పంపిణీకి పోటీపడ్డారు.గోపాలపురంలో అత్యధికంగా 98.66 శాతం పంపిణీ చేశారు.ఇక్కడ 9197 మంది లబ్ధిదారులు ఉండగా 9074 మందికి అందజేశారు. చాగల్లులో 98.49 శాతం, కోరుకొండలో 98.48 శాతం, రాజమహేంద్రవరం అర్బన్ 98.42 శాతం, కొవ్వూరు 98.3 శాతం, నిడదవోలు అర్బన్ 98.26 శాతం, నల్లజర్లలో 98.13 శాతం, రాజానగరం 98.06 శాతం, తాళ్లపూడిలో 98 శాతం, రాజమహేంద్రవరం రూరల్‌లో 97.91 శాతం పంపిణీ జరిగింది. ఉండ్రాజవరంలో 97.77 శాతం, పెరవలి 97.72 శాతం, అనపర్తిలో 97.69 శాతం, నిడదవోలులో 97.67 శాతం కడియంలో 97.62 శాతం,కొవ్వూరు అర్బన్‌లో 97.62 శాతం పంపిణీ చేశారు. దేవరపల్లిలో 97.58 శాతం, సీతానగరంలో 97.44 శాతం,గోకవరంలో 97.44 శాతం, బిక్కవోలులో 96.83 శాతం, రంగంపేటలో 96.81 శాతం పంపిణీ జరిగింది. సర్వర్ డౌన్, డివైజర్లు పనిచేయక పోవడం, సెల్‌లో సిగ్నల్ లాగకపోవడం వంటి సమస్యలు ఎదురైనా ఎక్కడా వెనుకంజ వేయలేదు. నూరుశాతం పంపిణీకి ఉద్యోగులు ఉపక్రమించారు.

## నిలకడగా గోదారి

### 19 గంటలు.. 12.10 అడుగుల నీటిమట్టం



**తగ్గిన వరద :** ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నిలకడగా గోదావరి

- సాధారణస్థాయికి వరద ప్రవాహం
- భద్రాచలంలో మొదటి హెచ్చరిక ఉపసంహరణ
- ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం పట్టిన వరద
- 11.75 అడుగులకు తగ్గితే ఇక్కడా ఉపసంహరణ
- 5 నుంచి పంట నష్టం వివరాలు ప్రకటన

రాజమహేంద్రవరం,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి)/ధవళేశ్వరం : గోదావరి నీటిమట్టం ధవళేశ్వరం వద్ద నిలకడగా కొనసాగుతోంది. 19 గంటల పాటు 12.10 అడుగుల వద్ద నిలకడగా ఉన్న నీటిమట్టం ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో 2 పాయింట్ల మేర స్వల్పంగా పెరిగి 12.30 అడుగుల వరకు చేరుకుంది. ఆపై గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి తగ్గడం మొదలు పెట్టి 3 గంటలకు 12.10 అడుగులకు చేరుకుని నిలకడగా కొనసాగుతోంది. రాత్రి 7 గంటలకు అదే 12.10 అడుగుల వద్ద నీటి మట్టం కొనసాగుతుండగా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 10,30,897 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. నీటిమట్టం మధ్యాహ్నం మూడు గంటల నుంచి 12.10 అడుగులుగా ఉంది. ఇది 11.75 కంటే తగ్గినా మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకుంటారు.రాత్రి 12 గంటలకు కోనసీమ జిల్లా మీదుగా దిగువకు 9,94,123 క్యూసెక్కులు పోతోంది. నీటిమట్టం 11.80 అడుగులుగా ఉంది. శుక్రవారం మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చ రికను ఉపసంహరించారు. గురువారం రాత్రి 8 గంటలకు నీటిమట్టం 39.80 అడుగులుగా ఉంది. ప్రస్తుతం సాధారణ వరద మాత్రమే కొనసాగుతోంది.అయితే లంకలు ఇంకా నీటి ముంపు నుంచి తేరుకోలేదు. పంట పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ప్రస్తుతం గోదావరి తగ్గడంతో లంకలో నీరు లాగడానికి మరో రెండు రోజులు పట్టవచ్చని అంచనా. ఇదిలా ఉండగా సుమారు 15 రోజుల వరద తర్వాత ఇసుక తిప్పలు వరద నుంచి బయట పడ్డాయి. జిల్లా పంట డ్యామేజీని ఈనెల 4వ తేదీలోపు అంచనా వేయనున్నారు. మరి కొంత నీటిమట్టం తగ్గితే ధవళేశ్వరం వద్ద సాధారణ స్థితికి చేరుకుంటుంది. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ముంపు ప్రాంతాల్లో పర్యటించి నష్టపరిహారంపై అంచనా వేస్తామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకూ రైతుసేవా కేంద్రాల వద్ద నష్టపోయిన రైతులు,పంట వివరాలు ప్రకటిస్తా మన్నారు. 12వ తేదీకి పూర్తి నష్టం నివేదికను కలెక్టర్ ఇస్తామన్నారు. మరో పక్క రెవెన్యూ, ఇతర శాఖలు ఎన్యుమరేషన్‌లో నిమగ్నమయ్యాయి.

## వారమంతా సదరం క్యాంపులు

**- సీహెచ్‌సీల్లోనూ ఆర్థోపెడిక్ పరీక్షలు**
**- జీజీహెచ్‌లో వారానికి రెండు రోజులు**

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 1 : జిల్లా వ్యాప్తంగా సదరం క్యాంపులను నిర్వహించి ధ్రువపత్రాలు జారీ చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి వెల్లడించారు.ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సదరం సర్టిఫికెట్ కావాల్సిన వారు ముందుగా తమ పేర్లను గ్రామ సచివాలయాల్లో స్లాట్ కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. స్లాట్ కేటాయించిన తర్వాత వారికి కేటాయించిన తేదీల్లో వైద్య పరీక్షలకు హాజరుకావాల్సిందిగా సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుందన్నారు. సీహెచ్‌సీల్లో ప్రతి సోమవారం కొవ్వూరు, గోపాలపురం, మంగళవారం గోకవరం, కడియం, బుధవారం నిడదవోలు, రాజానగరం, గురువారం అనపర్తి సీహెచ్‌సీల్లో ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ప్రతి మంగళవారం, శుక్రవారం ఐదు విభాగాలకు సంబంధించిన సదరం క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



ఎన్నికైన పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా కార్యవర్గ సభ్యులు

## పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా కార్యవర్గం

రాజానగరం, ఆగస్టు 1 : ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ మూర్తి గురువారం తెలిపారు.ఈ మేరకు వైజాగ్ శిల్పారామంలో బుధవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా మర్ల సీతారామశాస్త్రి(రాజా)(కోరుకొండ), గౌరవాధ్యక్షులుగా జ్యోష్యుల సుబ్రహ్మణ్యం(నిడదవోలు),ప్రధాన కార్యదర్శిగా ఆరాధ్యుల నరేంద్రబాబు (సీతానగరం), గౌరవ సలహాదారుగా పురాణపండ జయలక్ష్మి మాధవానంద్(రాజమహేంద్రవరం),అధికార ప్రతినిధిగా వెలివెంటి సత్యనాగ వరప్రసాద్ (ధవళేశ్వరం), కార్యనిర్వహణాధికారిగా మర్ల సుబ్రహ్మణ్య కౌండిన్య (కలవచర్ల), కార్యనిర్వహణ కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం (చాగల్లు), ప్రచార కార్యదర్శిగా కొత్తూరి వీరవెంకట సత్యనారాయణమూర్తి(అనపర్తి), యువజన విభాగ అధ్యక్షులుగా కోడూరి సాయి విశ్వనాథ మణికంఠ కిరణ్ శర్మ(నిడదవోలు), కార్యదర్శిగా కొత్తూరి వెంకట సుబ్బారావు(వేమగిరి), కోశాధికారిగా భవానీభట్ల శ్రీకాంత్ శర్మ(రాజానగరం) ఎన్నికయ్యారు.

## అందరికీ ఇసుక అందాలి

- ఎటువంటి లోటుపాట్లకు తావివ్వొద్దు
- ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా

నిడదవోలు/పెరవలి, ఆగస్టు 1: ఇసుక పంపిణీ విధానంలో ఎటువంటి లోటుపాట్లుకు తావులేకుండా.. ప్రజలు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. నిడదవోలు మండలం పెండ్యాల ఇసుక ర్యాంపు, పెరవలి మండలం ఉసులుమర్రు స్టాక్ పాయింట్‌ను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి గురువారం తనిఖీ చేసి మాట్లాడారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు నిర్వహించాలన్నారు. విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది జవాబుదారీతనం కలిగి ఉండి సమయపాలన పాటించాలన్నారు.లోకల్, నాన్‌లోకల్ అన్న పరిస్థితులు లేకుండా ఇసుక కోసం వినియోగదారుడు చేస్తున్న అభ్యర్థనే ప్రామాణికంగా ఇసుక పంపిణీ విధానం అమలు చేయాలన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లా డుతూ జిల్లా ఇసుక రీచ్‌లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక అమ్మకాలను నిర్వహిస్తున్నామన్నారు. రీచ్‌లలో ఇసుక లభ్యతను బట్టి లైన్లో ఉండే వాహనాలకు టోకెన్లు జారీ చేస్తున్నట్టు చెప్పారు. సాయంత్రం 6 తరువాత ఎటువంటి లోడింగ్ జరగకుండా క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు.ఇసుక ఎగుమతి చేసుకోవడానికి వచ్చిన లారీ డ్రైవర్లు, ప్రజలను ఉసులుమర్రు స్టాక్‌పాయింట్ వద్ద సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.నరసింహులు,మైన్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పెండ్యాల ర్యాంపు వద్ద ముఖేష్‌కుమార్ మీనాతో మాట్లాడుతున్న కలెక్టర్

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

## 'సమస్యలపై ఐక్యంగా పోరాడాలి'

కొవ్వూరు, ఆగస్టు 1: రాష్ట్రంలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులంతా ఐక్యతగా ఉండి సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు నక్కా వెంకటరత్నం అన్నారు. గురువారం కొవ్వూరు ఏఎంసీ కార్యాలయంలో దాసరి మోహన్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గంలో పదవులు పొందిన వారికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటుగా ఎన్నికైన వెంకటత్నం, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పోలిశెట్టి శివలను ఏఎంసీ సెక్రటరి టి.శ్రీనువాసులు, కార్యాలయ సిబ్బంది సత్కరించారు. శివ మాట్లాడుతూ రాష్ట్రంలో మార్కెట్ కమిటీలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న చెక్‌పోస్టులు చాలా అధ్వానస్థితిలో ఉన్నాయని వాటిని పునః నిర్మించాలని, సిబ్బందికి వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐ.వెంకటేశ్వరరావు, ఎస్.మాధురి, ఎం.చిట్టిబాబు, ఎస్.హరికృష్ణ, సీహెచ్ వెంకట్రాజు, ఎం.సుబ్రహ్మణ్యం, ఎ.నాగేశ్వరరావు, కె.సురేష్, ఆర్.బాలాజి పాల్గొన్నారు.

## చర్చిపేట బిల్డింగ్ పెయింటర్స్ యూనియన్ నూతన కార్యవర్గం

నిడదవోలు, ఆగస్టు 1: నిడదవోలులోని కాపు కళ్యాణ మండపంలో గురువారం సీఐటీయూ అనుబంధ సంస్థ చర్చిపేట బిల్డింగ్ పెయింటర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జువ్వల రాంబాబు, ఉపాధ్యక్షులుగా తూరుగోపు ముత్యాలరావు, ఉసురుమర్తి ప్రభాకర్, కార్యదర్శిగా మర్రిపూడి అశోక్, సహాయ కార్యదర్శిగా గుమ్మడి రమేష్, కోశాధికారిగా తలారి బాబు పలువురు కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు, ఆగస్టు 1: మండలంలోని తాడిమళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ మెయింటినెన్స్ నిమిత్తం ఈనెల 2వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

**చాగల్లు:** కలవలపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా కలవలపల్లి, చిక్కాల గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ తెలిపారు.

## విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు పంపిణీ

నల్లజర్ల, ఆగస్టు 1: నల్లజర్ల హైస్కూల్‌కు దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత బస్సు పాస్‌లు మంజూరు చేసినట్టు ఆర్టీసీ తాడేపల్లిగూడెం మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. గురువారం హైస్కూల్లో 200మంది విద్యార్థినులకు డాల్ఫిన్ వాటర్ సంస్థ సహకారంతో ఉచిత బస్సు పాస్‌లను అందించిందన్నారు. సదరు సంస్థ 2016 నుంచి విద్యార్థులకు ఉచిత బస్సులు మంజూరు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో డాల్ఫిన్ సంస్థ అధినేత దుగ్గిన లీలాకృష్ణ, హెచ్ఎం కోమలి చిత్ర, ఆర్టీసీ సిబ్బంది విజయకుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందజేత

దేవరపల్లి, ఆగస్టు 1: ప్రభుత్వం అందించే మౌలిక సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి సుధారాణి అన్నారు. మండలంలోని పల్లంట్ల జడ్పీ హైస్కూల్లో గురువారం విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, విద్యార్థి మిత్ర పథకం ద్వారా స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, చింతాల దాసు, తాళ్లూరి శ్రీను, ఆచంట రామ్‌ప్రసాద్, అక్కాబత్తుల వెంకటరమణ, మంగరాజు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి ఒకరి మృతి

కొవ్వూరు, ఆగస్టు 1: పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. కొవ్వూరు మండలం పెనకనమెట్ట గ్రామానికి చెందిన కోడి వీరరాఘవ భర్త కోడి శ్రీను(50) ప్రతిరోజు మద్యం తాగి ఇంటికి వస్తున్నాడు. జూలై 30న భార్య. 'ఏదొక ఒక పనిచేయక పోతే ఎలా? కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉందని' భర్తకు చెప్పింది. రాత్రి బయటకు వెళ్లి వచ్చిన శ్రీను నిద్రపోయాడు. 31వ తేదీ ఉదయం వాంతులు చేసుకుంటుండగా ఏమిటని అడుగగా రాత్రి ఏదో పురుగులు తాగానని చెప్పడంతో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం, అక్కడ నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. డాక్టరు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కొవ్వూరు, ఆగస్టు 1: జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాల్లో జాతీయ నాయకుల విగ్రహాలు, స్థూపాలు నెలకొల్పడం చట్ట విరుద్ధమని ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, గ్రామ పంచాయతీ స్థలాల్లో అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటుచేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలతో పాటు సామాజిక ఉద్రిక్తతలు నెలకొని శాంతి భద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. నిబంధనలు పాటించకుంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విగ్రహాలు, వాటి కోసం ఏర్పాటు చేసిన దిమ్మలను తొలగిస్తామని స్పష్టం చేశారు.


చాగల్లులో పెన్షన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి


నిడదవోలులో దివ్యాంగుడికి పింఛను అందజేస్తున్న మంత్రి దుర్గేష్


పెరవలి: కానూరులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న మంత్రి దుర్గేష్

# పింఛన్..ఆనందించెన్..

### పింఛన్ల పంపిణీ పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు, ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో సిబ్బంది జవాబుదారితనం కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కొవ్వూరులోని ఎన్‌జీవో హోం సచివాలయ పరిధిలో, ఇందిరమ్మ కాలనీలో జరిగిన పింఛన్ల పంపిణీని గురువారం ఉదయం ఆమె తనిఖీ చేసి, సిబ్బందికి సూచనలు చేశారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసఫ్, ఇన్‌చార్జి తహశీల్దార్ కె.అజయ్‌బాబు సిబ్బంది ఉన్నారు. కొవ్వూరులోని 15వ వార్డు బ్రిడ్జిపేట, 3వ వార్డుల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. బ్రిడ్జిపేటలో ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలో 3992మందికి రూ.1.73 కోట్ల మేరకు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేశామని మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసఫ్ తెలిపారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, మడిచర్ల రామచంద్రరావు, పెనుమాక జయరాజు, డేగల రాము, కొక్కిరిపాటి వెంకటేష్, బొంతా కిషోర్ పాల్గొన్నారు.


కొవ్వూరులో పింఛన్ల పంపిణీని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

**చాగల్లు:** చాగల్లు పాటిమ్మపేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు పింఛన్లు అందజేశారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులతో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానిక రజకుల చెరువు గట్టుపై కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కరుటూరి సతీష్, కేతా సాహెబ్, దొంగ రామకృష్ణ, తాళ్ళూరి హరిశ్చంద్రప్రసాద్, గ్రంధి రాంబాబు, తాళ్ళూరి వరప్రసాద్, కంచుమర్తి చినసుబ్బారావు, ఇంటి వీరబాబు, మిరియాల సతీష్, ఎంపీడీవో ఎన్.బుజ్జి, ఇన్‌చార్జి తహశీల్దార్ నిరంజన్ పాల్గొన్నారు.

**తాళ్లపూడి:** తాళ్లపూడిలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పాల్గొన్నారు. సచివాలయ ఉద్యోగులు మధ్యాహ్నానికి 90శాతం పంపిణీ పూర్తిచేశారని మండలంలో 7917 మందికి గాను రూ.3,33,93,000 విడుదలయ్యాయని ఎంపీడీవో టీవీవీ రమణ తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి, డీపీవో రాంబాబు, ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతి పర్యవేక్షించారు. గ్రామాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు పింఛన్లు అందజేశారు.

**గోపాలపురం:** మండలంలోని వేలచింతలగూడెంలో టీడీపీ నాయకుడు ఇల్లూరి రాము ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ పాల్గొని గ్రామ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి 1వ తేదీన సామాజిక పింఛన్లు పంపిణీ చేసే సత్తా సీఎం చంద్రబాబుకే ఉందన్నారు. ఇన్‌చార్జి తహశీల్దార్ ప్రదీప్, కొర్లపాటి రాము, ప్రత్యేకాధికారి శ్రీనివాస్, గన్నమని చిట్టిబాబు, డీటీ ఎస్.కృష్ణ, ఎంపీడీవో రమేష్ పాల్గొన్నారు.

**దేవరపల్లి:** మండలంలో 97శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. మిగిలినవి స్థానికంగా లేనివారు, ఇటీవల మరణించిన వారి పింఛన్లు మాత్రమేనని, శుక్ర వారం మధ్యాహ్నానికి పూర్తి చేస్తామన్నారు. లక్ష్మీపురంలో కార్యదర్శి ఎం.రవి కిషోర్, టీడీపీ నాయకులు అమరావతి, మెంతిమి సురేష్, దేవరపల్లిలో కూటమి నాయకులు కార్యకర్తలు పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### జిల్లాలోనే ప్రథమ స్థానం

గోపాలపురం, ఆగస్టు 1: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో గోపాలపురం, జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. ఒక పక్క ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు జోరువాన కురుస్తున్నా లెక్కచేయకుండా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వాయువేగంతో కొనసాగించామన్నారు. సిబ్బంది అంకితభావంతో పనిచేయడంతో మొదటి రోజే పింఛన్లను 99శాతం పంపిణీ చేశామన్నారు. పింఛన్ల పంపిణీలో పాల్గొన్న సచివాలయ సిబ్బందికి పర్యవేక్షకులుగా వ్యవహరించిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### ఉదయం 5 గంటలకే పింఛన్ల పంపిణీ : మంత్రి దుర్గేష్

నిడదవోలు/పెరవలి/ఉండ్రాజవరం:, ఆగస్టు 1: ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఉదయం 5గంటల నుంచే లబ్ధిదారులకు అందిస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం నిడదవోలులోని ఎన్టీఆర్ కాలనీ, మండలంలోని పురుషోత్తపల్లి, పెరవలి మండలం కానూరు, ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో జరిగిన పింఛన్లను పంపిణీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రజా సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో నిడదవోలు మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, తహశీల్దార్ పి.శ్రీనివాస్, కానూరులో వాకలపూడి వీర్రాజు, ముళ్ళపూడి రాజు, కృష్ణారావు, రంకిరెడ్డి ప్రసాద్, కోలా సీతయ్య నాయుడు, తాడిపర్రులో ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, జనసేన మండలాధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు పాల్గొన్నారు. కాగా పెరవలి మండలంలో పింఛన్ల పంపిణీ 98శాతం పూర్తి చేసినట్టు ఎంపీడీవో హిమమహేశ్వరి తెలిపారు. 10,406 పింఛన్లకు గాను 9,638 పంపిణీ అయ్యాయని రూ.4,05,87,000 సొమ్ము పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.


తాళ్లపూడిలో పింఛన్లు అందిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ


గోపాలపురం: వేల్లచింతలగూడెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ


దేవరపల్లి: లక్ష్మీపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

# ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకం

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి జవహర్
- షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై అత్యున్నత న్యాయస్థానం తీర్పునకు హర్షం


నిడదవోలులో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్‌లకు నివాళులర్పిస్తున్న నాయకులు


నల్లజర్ల: చీపురుగూడెంలో మందకృష్ణ, అంబేద్కర్ చిత్రపటాలకు పాలభిషేకం


తాళ్లపూడి: పెద్దేవంలో హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


ఉండ్రాజవరం: కాల్దరిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


గోపాలపురం: పెద్దగూడెంలో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొవ్వూరు, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు మాదిగల చిరకాల పోరాటానికి ఫలితమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ అన్నారు. మంద కృష్ణ నాయకత్వంలో వర్గీకరణ సాధించడం చరిత్రాత్మకమన్నారు. చంద్రబాబు 30 ఏళ్ల క్రితమే వర్గీకరణ చట్టానికి శ్రీకారం చుట్టి సానుకూలంగా వ్యవహరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా ఇటువంటి తీర్పు రావడం శుభసూచికమన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టి జగన్ చలికాచుకున్నారన్నారు. మాదిగలను ఓటు బ్యాంకుగానే చూశారు ఈ వర్గీకరణ దళిత ఉపకులాలకు రాజ్యాంగ ఫలితాలను పంచుతూ ఐక్యతను పెంచుతుందన్నారు.

### ఓపెన్ కేటగిరిలోనూ వర్గీకరణ జరగాలి

ఎస్సీ కులాల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ఆహ్వానిస్తున్నామని పౌరహక్కుల సంఘం నాయకుడు నంబూరి శ్రీమన్నారాయణ అన్నారు. ఓపెన్ కేటగిరిలో కూడా ఆర్థిక వెనుకబాటుతనం ఆధారంగా వర్గీకరణ జరగాలన్నారు. క్రిమిలేయర్ విధానం అమలుపరచాలని, అప్పుడే సాంఘిక ఆర్థిక సమానత్వాన్ని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 లక్ష్యాలను కొంతమేర చేరగలుగుతామన్నారు.

### 30 ఏళ్ల పోరాట ఫలితం

ఎస్సీ వర్గీకరణపై మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితానికి నేడు సుప్రీంకోర్టు న్యాయమైన తీర్పు ఇచ్చిందని ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఎస్సీ సెల్ నాయకుడు వరిగేటి కాంతరాజు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ బిల్లును ఆమోదించే అవకాశాలు కల్పించిందన్నారు. వర్గీకరణకు సహకరించిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మందకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గెల్లా సురేష్, పెనుమాక జయరాజు, అయినపర్తి రాజేంద్రప్రసాద్, జీజీ చలం, వేమగిరి వెంకట్రావు, కొక్కిరిపాటి వెంకటేష్, కె.శ్రీహరి, డి.సోమలక్ష్మి పాల్గొన్నారు.

### మాదిగల ఆకాంక్ష నెరవేరింది

నిడదవోలు, ఆగస్టు 1: ముప్పై ఏళ్ల సుదీర్ఘ పోరాటం, అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో మాదిగల ఆకాంక్ష నెరవేరిందని ఎమ్మార్పీఎస్ నాయకుడు భీమడోలు కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం నిడదవోలు తహల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వర్గీకరణ వల్ల ఎస్సీ ఎస్టీల్లో వెనుకబడిన కులాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. మంద కృష్ణ మాదిగకు మాదిగలంతా రుణపడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో బైపే రాజేశ్వరరావు, గొడవర్తి విజయ్‌కుమార్, ముప్పిడి సురేష్, చదలవాడ వెంకటేష్, భీమడోలు వీర్రాజు పాల్గొన్నారు.

### వర్గీకరణ మాదిగల చిరకాల కోరిక

నల్లజర్ల, ఆగస్టు 1: రెండు తెలుగు రాష్ట్రాల్లో దశాబ్దాల నుంచి మాదిగల చిరకాల కోరిక రాష్ట్రంలో కూటమీ ప్రభుత్వం, కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం సమక్షంలో ఏబీసీ వర్గీకరణ జరగడం ఆనందదాయకమని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు మర్లపూడి ఏసుదాసు అన్నారు. షెడ్యూల్ కులాల వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుతో మాదిగలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలం చీపురుగూడెంలో ఏసుదాసు ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. 59 ఉపకులాలకు న్యాయం జరిగే విధంగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు త్వరగా శాశనసభలో ఆమోదం తెలిపి తమ నిబద్ధతను చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మోదుగ సుబ్బారావు, జాలాది వెంకటేశ్వరరావు, కండెల్లి శేఖర్, గెరా శ్రీను, కలపాల గెర్రాజు, ఆనందస్వరూప్, పెనుమాక వెంకటరత్నం పాల్గొన్నారు. నల్లజర్లలో జాషువానగర్‌లో బాబుజగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి వెంకట రాజు ఆధ్వర్యంలో పాలభిషేకం చేశారు. కలపాల శేషు, మర్రి శోభన్‌బాబు, కిషోర్, వేణు, రమణ, సిద్దూ పాల్గొన్నారు.

### సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం

తాళ్లపూడి, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణను ఆమోదిస్తూ సుప్రీంకోర్టు తీర్పుపై మండలం పెద్దేవం గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు గెద్దం విజయ భాస్కరరావు, జిల్లా అధ్యక్షుడు గెద్దం వినోద్ హర్షం వ్యక్తం చేశారు. మంద కృష్ణ మాదిగ పోరాట స్ఫూర్తిని మాదిగలందరూ గౌరవిస్తూ వర్గీకరణ సాధించినందుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో తిగిరిపల్లి పండు, కంకిపాటి సుబ్బారావు, గణశాల ఆకాష్, కొల్లి వెంకట సతీష్ పాల్గొన్నారు.

### సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు

ఉండ్రాజవరం, ఆగస్టు 1: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల ఉద్యమ పోరాట ఫలితంగా సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిద్దే మధుబాబు పేర్కొన్నారు. మండలంలోని పాలంగిలో మధుబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్, బాబూజగ్జీవన్ రామ్, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కాల్ధరి గ్రామంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెట్టే సుజనరావు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేసి విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. స్వీట్స్ పంచారు. సీనియర్ నాయకులను పూలమాలతో సత్కరించారు. ఉండ్రాజవరంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు, న్యాయవాది బొల్లిపో సునీల్‌రాజ్ ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించి, జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### వంద తరాల భవిష్యత్‌ను నిర్దేశించబోతోంది

గోపాలపురం, ఆగస్టు 1: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వంద తరాల భవిష్యత్తును నిర్దేశించబోతుందని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు తానేటి స్టీవెన్ అన్నారు. స్థానిక పెద్దగూడెంలో బాబు జగ్జీవన్‌రామ్ వద్ద కేక్ కట్ చేశారు. అలాగే ప్రధాన మంత్రి మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, సీఎం చంద్రబాబు చిత్రపటాలు, బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్టీవెన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగ కులాలు ముందడుగు వేస్తాయన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సుదీర్ఘకాలం పోరాటం చేసి వర్గీకరణ సాధించారన్నారు. కార్యక్రమంలో కొడమంచిలి చినవెంకటేష్, కొడమంచిలి శ్యామ్, దిర్శిపో పండు, చాపల రవి, మల్లిపూడి సుబ్బారావు, బీజేపీ మండలాధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు, ముప్పిడి అశోక్, తానేటి జ్యోతి, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

### సుప్రీం తీర్పు అమరజీవులకు అంకితం

దేవరపల్లి, ఆగస్టు 1: సుదీర్ఘకాలంగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు చేస్తూ పోరాటంలో ఆశువులు బాసిన అమరజీవులకు సుప్రీంకోర్టు తీర్పు అంకితమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొడవటి బుజ్జిబాబు మాదిగ అన్నారు. గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ అంశంలో రాష్ట్రాలకు అధికారాన్నిస్తూ ఇచ్చిన తీర్పుపట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. 30ఏళ్ళుగా ఎస్సీ వర్గీకరణ కోసం అనేక ఉద్యమాలు చేశామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, ఏపీలో సీఎం చంద్రబాబుతోపాటు దేశంలో ఉన్న అనేక అధికార, ప్రతిపక్ష పార్టీలు బాధితులకు అండగా నిలిచి వర్గీకరణకు సహకరించినందుకు కృతజ్ఞతుల తెలిపామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పల్లెలో కృతజ్ఞత యాత్రలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాపాక రాంబాబు, మల్లిపూడి శ్రీను, ఈర్లగడ్డ రమేష్, మల్లిపూడి రాంబాబు, సూర్యచంద్రం పాల్గొన్నారు.

# పిల్లలకు తల్లి పాలే శ్రేష్టం

**ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు**

**పలుచోట్ల ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు**


గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 1: పిల్లలకు తల్లి పాలే శ్రేష్టమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొవ్వూరు 15వ వార్డు బ్రిడ్జిపేటలో టీవీఆర్ కళ్యాణ మండపంలో నియోజకవర్గ ప్రభాత్ పోషకాహార కార్యక్రమం, ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ పీవో డి.మమ్మీ అధ్యక్షతన నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ తల్లి పాల వల్ల బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. అపోహలను విడనాడి పుట్టిన గంటలోపే పిల్లలకు తల్లి పాలు ఇవ్వాలని, ఆరు నెలల పాటు తప్పనిసరిగా తాగించాలన్నారు. గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మద్దిపట్ల శివరామకృష్ణ, జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, బోడపాటి ముత్యాలరావు, మడిచర్ల రామచంద్రరావు, తాడిమళ్ళ విజయవాణి, టీడీపీ అమెరికన్ ఇండియా ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

**పెరవలి:** మండలంలోని ఖండవల్లి పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఏఎన్ఎం రాణి రత్నకల్ తల్లిపాల విశిష్టతను తెలిపారు. తల్లి పాలలో రోధనిరోధక శక్తి అధికంగా ఉంటుందని, పుట్టిన పిల్లలకు తప్పనిసరిగా తల్లి పాలు పట్టించాలన్నారు. 7వ తేదీ వరకు ఈ వారోత్సవాలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో దుర్గాదేవి, సీత, సావిత్రి, కుమారి, దుర్గాలక్ష్మి పాల్గొన్నారు.

**చాగల్లు:** చాగల్లులోని అంగన్‌వాడి కేంద్రాలు 61, 62, 63, 64 పరిధిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ పి.పద్మావతి తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యమని, తప్పనిసరిగా ముర్రిపాలు తాగించాలన్నారు. సిబ్బంది పి.విజయకుమారి, నీలిమ, సుబ్బలక్ష్మి, పాల్గొన్నారు.

## సినిమా గైడ్

| | |
|---|---|
| **కొవ్వూరు** | |
| యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1 | రాయన్,కల్కి |
| వై.స్క్రీన్2 | శివం భజే |
| దేవిశ్రీ(గాయత్రి | బడ్డీ |
| అనన్య | తిరగబడరా సామీ |
| **నిడదవోలు** | |
| వీ మ్యాక్స్ | డెడ్‌పూల్ |
| రాధాకృష్ణ | రాయన్ |
| శ్రీగణపతి | కల్కి |
| **దేవరపల్లి** | |
| శ్రీరామ్ సినీ మ్యాక్స్ | కల్కి |
| శ్రీరామ్ సినీ మ్యాక్స్ | కల్కి |
| **నల్లజర్ల** | |
| శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1 | భారతీయుడు-2 |
| స్క్రీన్ 2 | కల్కి |
| శ్రీనివాస | --- |

# విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

**ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు**

చాగల్లు, ఆగస్టు 1: విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఊనగట్ల జడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించి పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పదో తరగతిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఇప్పటి నుంచే క్రమశిక్షణతో ప్రణాళిక బద్ధంగా చదువుకుంటే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారని ఆయన చెప్పారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు యంటపల్లి లోకేష్ ఆర్థిక సాయంతో సమకూర్చిన వాటర్ ఫిల్టర్‌ను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, బొల్లిన శివనాగేంద్ర, కారింకి సత్యనారాయణ, పుల్లూరి వెంకటేశ్వరరావు, మనెల్లి నాని, నందిగం విష్ణు హెచ్‌ఎం ఎస్.రమణయ్య పాల్గొన్నారు.

### పాడిరైతులకు సమీకృత దాణాను పంపిణీ

కొవ్వూరు, ఆగస్టు 1: గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో పాడిరైతులకు ప్రభుత్వం ఉచితంగా సమీకృత దాణాను పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం మద్దూరులంక, సీతంపేట గ్రామాలలో గోదావరి వరద బాధితులకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం రైతుకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పశు సమీకృత దాణా 5 టన్నులు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొలిశెట్టి రత్నకుమారి, జెట్టి బంగారయ్య, ఎంపీపీ కాకర్ల నారాయుడు, జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, ఎంపీటీసీ దేవన సత్యనారాయణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, పశు సంవర్ధకశాఖ ఏడీఏ ఎ.వెంకటరెడ్డి, ఎంపీడీవో కె.సుశీల, పశువైద్యాధికారి కేఎస్‌వీ చంద్రమౌళి పాల్గొన్నారు.